


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 247 | ఆదివారం 13 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3




## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ

- సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబును కలిసిన బీఆర్ నాయుడు, టీటీడీ సభ్యులు
- చంద్రబాబుకు వేదాశీర్వచనం పలికిన టీటీడీ వేద పండితులు
- సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక బులెటిన్ విడుదల చేసిన టీటీడీ

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు అధికారికంగా ఆహ్వానించారు. అమరావతి సమీపంలోని ఉండవల్లి వద్ద గల సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని టీటీడీ చైర్మన్, ఈవోలతో పాటు బోర్డు సభ్యులు జ్యోతుల మిగతా2లో

## సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ





- సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమావేశం
- ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన భేటీ
- మర్యాదపూర్వకంగానే సమావేశమైన ఇరువురు నేతలు
- పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏపీకి వచ్చిన నడ్డా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమ ంత్రి నారా చంద్రబాబు నాయు డుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాద పూర్వకంగా భేటీ అయ్యా రు. శని వారం ఉదయం ఉండవ ల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రం లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పా ల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చం ద్రబాబు తన నివాసా నికి ఆహ్వానించారు. సీఎం నివా సానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాద పూర్వక సమావేశమేనని 2లో



## ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్
ఏడు దశల తనిఖీ అంటున్నా అక్రమాలు ఎలా జరిగాయని విమర్శ
నకిలీ ఖోఖో సర్టిఫికెట్లు, జరగని క్రీడాపోటీల అంశాలను ప్రస్తావించిన వైనం
నియామక ప్రక్రియపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు.

## భారీ ప్యాకేజీతో పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి



- పౌల్ట్రీ రంగం అభివృద్ధి కోసం రూ. 657 కోట్ల ప్యాకేజీ ప్రకటించామన్న అచ్చెన్న
- ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడి

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి 2లో



## దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

- బీసీ రక్షణ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న సవిత
- బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు
- చంద్రబాబుతోనే సాధ్యమని వ్యాఖ్య
- జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని విమర్శ

బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయ వాడ సమీపంలోని ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్ట ం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీల కు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తిం పు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయక త్వంలోనే మిగతా2లో

## విశాఖలో కాలిబూడిదైన ఆర్టీసీ బస్సు



విశాఖపట్నంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది.

విశాఖ వాల్తేరు డిపో సమీపంలో ఘటన
నెల్లూరు నుంచి వచ్చిన బస్సులో అకస్మాత్తుగా మంటలు
ఇంజిన్‌లో మొదలై నిమిషాల్లోనే వ్యాపించిన అగ్నికీలలు
ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి నెల్లూరు నుంచి ప్రయాణికులతో వచ్చిన ఈ బస్సును వాల్తేరు డిపో వద్ద నిలిపి ఉంచారు. అయితే, శనివారం తెల్లవారుజామున బస్సు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడ్డాయి. చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి మిగతా2లో

## సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చిత్తశుద్ధి అమోఘం



సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చొరవను కొనియాడిన నడ్డా
అమరావతి క్వాంటం బయో వ్యాలీకి కేంద్రం పూర్తి సహకారం
ఏపీ 'సంజీవని' కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో పరిశీలిస్తామన్న నడ్డా
సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ సురక్షితంగా ఉందని ప్రశంస
'వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం' అనే నినాదాన్ని సమర్థించిన మంత్రి

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా మిగతా2లో

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ

ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు సీఎం చంద్రబాబుకు మంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను బహూకరించారు. అనంతరం తిరుమలలో త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై టీటీడీ నాయకత్వంతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దేశ విదేశాల నుంచి విచ్చేసే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ, లడ్డూ ప్రసాదాల నిల్వ, భద్రత మరియు పారిశుధ్య నిర్వహణపై సీఎం దిశానిర్దేశం చేశారు. తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరగనుండగా, ఆ తర్వాత నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ స్వామివారు వివిధ అలంకారాల్లో చేసే వాహన సేవలు, విశేష ఉత్సవాలు, ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయ వేళలను భక్తులకు తెలియజేసేందుకు ఇప్పటికే ప్రత్యేక బుక్‌లెట్‌ను టీటీడీ విడుదల చేసింది. ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణతో సహా గరుడ సేవ వంటి కీలక ఘట్టాల నిర్వహణకు దేవస్థానం సర్వం సిద్ధం చేస్తోంది.

# సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

# ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?

ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న 'ఏడు దశల వెరిఫికేషన్' ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహరిస్తోందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. "ఇన్ని అక్రమా లు బయటపడుతుంటే, అసలు ఎక్కడ, ఏం వెరిఫి కేషన్ చేశారు?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా, డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు. ఈ లోపాలే అక్రమాలకు ఆస్కారం కల్పించాయా అని సందేహం వ్యక్తం చేశారు. జరిగిన తప్పులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. కాగా, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉంది. అయితే, నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని, సర్టిఫికెట్ల పరిశీలన పలు దశల్లో పకడ్బందీగా నిర్వహించామని ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. కొన్ని ఆరోపణలపై అధికారులు మీడియా సమావేశాల్లో వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా జగన్ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న పారదర్శకతకు, ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు మధ్య డీఎస్సీ ప్రక్రియ రాజకీయ వివాదంగా కొనసాగుతోంది.

# భారీ ప్యాకేజీతో పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లో-టెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

# దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

# విశాఖలో కాలిబూడిదైన ఆర్టీసీ బస్సు..

విశాఖపట్నంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచిన ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి నెల్లూరు నుంచి ప్రయాణికులతో వచ్చిన ఈ బస్సును వాల్తేరు డిపో వద్ద నిలిపి ఉంచారు. అయితే, శనివారం తెల్లవారుజామున బస్సు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడ్డాయి. చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ముప్పు తప్పినట్లయిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# రూ.253 కోట్లతో అమరావతిలో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

# శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షాలు..



బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న కొన్ని గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాగల 6 గంటల పాటు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు ఉన్న జిల్లాల్లో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో రాగల రెండు గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ వర్షాలతో పాటు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

పైన పేర్కొన్న మూడు జిల్లాలు మినహా మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికల దృష్ట్యా, అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చిత్తశుద్ధి అమోఘం

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.

**అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ**

రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

**'సంజీవని'పై ప్రశంసలు.. జాతీయ స్థాయిలో పరిశీలన**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# కుష్టు వ్యాధి సర్వేను తనిఖీ చేసిన వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 12** చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అల్లాడు పల్లె సచివాలయం, గ్రామంలో జరుగుతున్న కుష్టు వ్యాధి సర్వేను నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు తనిఖీ చేసి వైద్య సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ పి.ఓబులేసు మాట్లాడుతూ అల్లాడు పల్లె సచివాలయం పరిధిలోనీ గ్రామాలలో కుష్టు వ్యాధి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఏ ఒక్కరికి వ్యాధి లక్షణాలు ఉన్న వెంటనే అంతర్జాలంలో నమోదు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు చేపించి కుష్టు వ్యాధి ఉన్నది, లేనిది డాక్టర్ పరీక్షలు చేసి చెపుతారని డాక్టర్ పి.ఓబులేసు తెలియ జేశారు.ఒకవేళ వ్యాధి లక్షణాలు ఉన్నాయని తెలుస్తే వెంటనే చికిత్స మొదలు పెడతారని, మందులు పూర్తిగా ఉచితంగా ఇస్తారని ఆయన తెలిపారు.అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అల్లాడు పల్లె సచివాలయం పరిధిలో ప్రతి వ్యక్తిని టీం వారిగా పరీక్షలు జరిపి అనుమానిత కేసులు నమోదు చేస్తే వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి డాక్టర్ గారితో పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయిస్తామని రాజరాజేశ్వరి తెలిపారు. గ్రామంలో ఏ ఒక్కరిని మిస్ కాకుండ సర్వే చేసి కుష్టు రహిత సచివాలయం గా చేయాలని డాక్టర్ పి.ఓబులేసు వైద్య సిబ్బందినీ ఆదేశించారు. డాక్టర్ ఓబులేసు గారు ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిని గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు స్పర్శ కోల్పోయిన లేత రంగు చర్మపు మచ్చలు, మచ్చలపై చెమట పట్టకపోవడం వెంట్రుకలు రాలిపోవడం, చేతులు, కాళ్ళ, నరము లలో వాపు, లేదా నొప్పిఉండడం, అలాగే తిమ్మిర్లు, పట్టు కోల్పోవడం వంటి ముందస్తు లక్ష ణాలు కనిపెట్టాలన్నారు . అంతకు ముందే విలేజ్ హెల్త్ సెంటర్ లో రికార్డ్స్ ను వెరిఫై చేసి, గ్రామంలో అంటువ్యాధుల గురించి ప్రజలను అడిగి "ఆరా తీశారు " ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య,యం ఎల్ హెచ్ పి బి.రాజరాజేశ్వరి, ఎ ఎన్ యం,యం. అంజనమ్మ, ఆశా కార్యకర్త యం.నరసమ్మ, గ్రామంలో ప్రజలు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో తొలి జర్నలిస్టు డాక్టర్ కె.ఆర్ వెంకటాద్రి రావు శతజయంతి వేడుకలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 12 నంది పత్రిక** ఆళ్లగడ్డ తాలూకా చాగలమర్రి మండలంలోని నేలంపాడు గ్రామంలో 12-9-1926లో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య గ్రామంలో పూర్తిచేసి హైస్కూల్ విద్య అనంతరం ఆయుర్వేదంలో డాక్టర్ కోర్స్ పూర్తి చేశారు. అనంతరం ఆళ్లగడ్డ పట్టణంలో మొదట డాక్టర్ గా వెంకటాద్రి రావు ప్రాక్టీస్ ప్రారంభించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. ఆయనకు సామాజిక సేవ అంటే చాలా ఇష్టం. అందుచేత ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో మొదటిసారి ఆళ్లగడ్డ శాసనసభ నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవి చూశారు. అయినా కూడా ధైర్యంతో సామాజిక కార్యకర్తగా ముందుకు వారు అడుగు వేశారు. ఆళ్లగడ్డ పట్టణ శివారులో చింతకుంట గ్రామ సమీపంలో అనాధ బాలికల శరణాలయం ఏర్పాటు చేసి పేద బాలికలకు విద్యను అందించడానికి డాక్టర్ కె ఆర్ వెంకటాద్రిరావు కృషి చేశారు. అదేవిధంగా ఆళ్లగడ్డ పట్టణంలో శిల్పకళాల అభివృద్ధికి ప్రముఖ శిల్పి దురుగడ్డ బాల వీరాచారి తో కలిసి పత్రికల ద్వారా శిల్పాల గురించి రాసి రాష్ట్రంలో కాకుండా ప్రపంచవ్యాప్తంగా పేరు రావడానికి కృషి చేశారు. అలాగే ఆళ్లగడ్డ పట్టణంలో పాత కందుకూరు రోడ్లో కొత్తగా విశ్వరూప పారిశ్రామిక నగర్ ఏర్పాటుకు కృషి చేశారు ఆళ్లగడ్డ మండలంలోని భాచ్చాపురం మెట్ట వద్ద శ్రీ ధన్వంతరి దేవాలయం, శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయం నిర్మాణంతోపాటు చదలదిన్నె మెట్ట వద్ద శిధిలావస్థలో ఉన్న అతి పురాతనమైన శివాలయం నిర్మాణంలో డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు పాలుపంచుకున్నారు. డాక్టర్ వెంకటాద్రి రావు ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ పత్రికల్లో పనిచేసి ఆళ్లగడ్డ ప్రాంతంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. ఆయన పెద్ద కుమారుడు డాక్టర్ కె ఆర్ వి వసంతరాయులు, కోడలు డాక్టర్ కే సీతామాలక్ష్మి గార్లతో బాచ్చాపురం మెట్ట వద్ద ప్రాక్టీస్ పెట్టించాలని దృఢ సంకల్పంతో అక్కడ క్లినిక్ ప్రారంభించారు. ఆళ్లగడ్డ ప్రాంతానికి డాక్టర్ గా పేదలకు ఉచిత సేవలతో పాటు సీనియర్ జర్నలిస్టుగా సామాజిక కార్యకర్తగా డాక్టర్ కె.ఆర్ వెంకటాద్రి రావు చేసిన సేవలు మరువలేనివని ఆళ్లగడ్డ తాలూకా సీనియర్ పాత్రికేయులు కేపీవి సుబ్బారావు, మారం రెడ్డి జనార్దన్ రెడ్డి, యలనాల నాగరాజు, అక్షింతల శ్రీనివాసులు కరణం శ్రీనివాసరావు,మాటీవీ ప్రసాద్, దివంగత ప్రముఖ శిల్పి దురుగడ్డ బాల వీరాచారి కుమారులు దురుగడ్డరామకృష్ణమాచార్యులు, దురుగడ్డరవీంద్రాచార్యులు డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు సేవలను కొనియాడారు.

# పేద కుటుంబాల పండగ ఎన్టీఆర్ భరోసా పెన్షన్

## పేద కుటుంబాల పండగ సీఎం రిలీఫ్ ఫండ్..



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 12 కడప జిల్లా.** చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రెడ్డప్ప మాధవి, టిడిపి జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ ఎఫ్ కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ & కడప శాసనసభ్యురాలు రెడ్డప్ప మాధవి, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు. ఎమ్మెల్యే రెడ్డప్ప మాధవి ₹4.27,393 విలువైన 21 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదే విధంగా టిడిపి జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి ₹1,92,415 విలువైన 12 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య ఖర్చులు భారం మోస్తున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొలత భరోసాని ఇస్తుందని తెలిపారు. ఎలాంటి పార్సులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా కుటుంబ ప్రభుత్వం నిమిత్తం పనిచేస్తుందని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలు కూటం విజయమే లక్ష్యం.



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 12, కడప జిల్లా.** డివిజన్ నేతలకు ఎమ్మెల్యే రెడ్డప్ప మాధవి, టిడిపి జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి దిశా నిర్దేశం. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కడప నాగిరెడ్డి డివిజన్ ముఖ్య నాయకులతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ & రెడ్డప్ప మాధవి, టిడిపి జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాసులు రెడ్డి పాల్గొని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లలో కుటుంబ ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రతి గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కడప కార్పొరేషన్ తో పాటు అన్ని స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజామోదంతో విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు

# "వైద్యుడు దేవుడైతే... ప్రథమ చికిత్స చేసేవాడు దేవుడి దూత"





## ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సలో ప్రాథమిక శిక్షణ పొందాలి
## సెట్కూరు సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా సెట్కూరు మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో దిన్నెదేవరపాడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో శనివారం ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెట్కూరు సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రథమ చికిత్స ప్రాముఖ్యతను వివరించారు."వైద్యుడు దేవుడైతే... ప్రథమ చికిత్స చేసేవాడు దేవుడి దూత" అని డాక్టర్ కె. వేణుగోపాల్ అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అందించే సహాయం బాధితుడి ప్రాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ప్రమాదం జరిగినప్పుడు వైద్య సహాయం అందేలోపు బాధితుడికి అందించే ప్రథమ చికిత్స అత్యంత కీలకమని, సరైన సమయంలో అందించే చిన్న సహాయం కూడా ఒక అమూల్యమైన ప్రాణాన్ని కాపాడగలదని తెలిపారు. ప్రథమ చికిత్స అనేది వైద్యులకే పరిమితమైన విషయం కాదని, ప్రతి పౌరుడు కనీస ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉంటే అత్యవసర సమయంలో ఒకరికొకరు అండగా నిలిచి ఎన్నో ప్రాణాలను కాపాడగలమని పేర్కొన్నారు.

**ప్రయోగశాలలోనూ ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం**

పాఠశాలలు, కళాశాలల్లోని రసాయన శాస్త్ర ప్రయోగశాలల్లో విద్యార్థులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కె. వేణుగోపాల్ సూచించారు. రసాయన పదార్థాలతో ప్రయోగాలు చేసేటప్పుడు ఉపాధ్యాయులు, ప్రయోగశాల సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని, రక్షణ కళ్లద్దాలు, చేతి తొడుగులు వంటి భద్రతా పరికరాలను ఉపయోగించాలని తెలిపారు.యాసిడ్ లేదా ఇతర రసాయన పదార్థాలు చర్మంపై పడినప్పుడు వెంటనే ప్రభావిత ప్రాంతాన్ని పుష్కలంగా స్వచ్ఛమైన నీటితో కడిగి, అవసరమైన వైద్య సహాయం పొందాలని చెప్పారు. రసాయన పదార్థాలు కళ్లలో పడినప్పుడు కళ్లను రుద్దకుండా, వెంటనే స్వచ్ఛమైన నీటితో కళ్లను కడుగుతూ వైద్య సహాయం పొందాలని సూచించారు.రసాయనాల వల్ల చర్మంపై కాలిన గాయాలు ఏర్పడినప్పుడు స్వయంగా ఎలాంటి మందులు, క్రీములు లేదా ఇతర పదార్థాలు పూయకుండా వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. రసాయనాల నుంచి వెలువడే పొగ లేదా వాయువులు పీల్చిన సందర్భంలో బాధితుడిని సురక్షితమైన, గాలి ప్రసరణ ఉన్న ప్రదేశానికి తరలించి, అవసరమైతే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలని సూచించారు. "ప్రయోగశాలలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు. అందువల్ల రసాయన పదార్థాలను గుర్తించి, వాటి వినియోగ విధానాన్ని తెలుసుకుని, భద్రతా నియమాలను పాటించడం కూడా ప్రథమ చికిత్సలో భాగమైన అవగాహనలో ఒక ముఖ్యమైన అంశం" అని డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన మొదటి కొన్ని నిమిషాలు ఎంతో విలువైనవి.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు శ్రీనివాసరెడ్డి కీలక ప్రసంగకర్తగా పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలను విద్యార్థులకు వివరించారు.ప్రమాదం జరిగిన మొదటి కొన్ని నిమిషాలు ఎంతో విలువైనవి. ఆ సమయంలో మనం తీసుకునే సరైన నిర్ణయం ఒకరి జీవితాన్ని మార్చగలదు. వైద్యులు లేదా అంబులెన్స్ వచ్చే వరకు బాధితుడిని నిర్లక్ష్యం చేయకుండా, మనకు తెలిసిన ప్రాథమిక ప్రథమ చికిత్సను అందించాలి అని ఆయన సూచించారు.విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, రక్తస్రావం, కాలిన గాయాలు, రసాయన ప్రమాదాలు, సీపీఆర్ వంటి అంశాలపై ప్రదర్శనాత్మక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.అత్యవసర పరిస్థితుల్లో ముందుగా కంగారు పడకుండా పరిస్థితిని అంచనా వేయడం, బాధితుడికి ధైర్యం చెప్పడం, అవసరమైతే అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం ముఖ్యమన్నారు.ప్రమాదాల్లో అధిక రక్తస్రావం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున, గాయం నుంచి రక్తం ఎక్కువగా కారుతున్నప్పుడు శుభ్రమైన గుడ్డ లేదా బ్యాండేజ్‌తో గాయంపై తగిన ఒత్తిడి పెట్టి రక్తస్రావాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించాలని తెలిపారు.

**సీపీఆర్‌పై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం** గుండె ఆగిపోయినట్లు అనిపించే అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహన ఎంతో అవసరమని డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. సరైన శిక్షణ పొందిన వ్యక్తులు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ప్రారంభించడం ద్వారా వైద్య సహాయం అందే వరకు బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశాలను పెంచగలరన్నారు.

**ప్రతి ఇంట్లో ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరి**

ప్రతి ఇంట్లో, పాఠశాలలో, కార్యాలయంలో, వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. బ్యాండేజీలు, గాజ్, ప్లాస్టర్లు, యాంటీసెప్టిక్ వంటి అవసరమైన ప్రాథమిక సామగ్రిని అందులో ఉంచుకోవాలన్నారు. మందులను మాత్రం బాధ్యతగా, అవసరమైనప్పుడు వైద్యుల సూచనల మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు.ప్రిన్సిపాల్ నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రథమ చికిత్సపై అవగాహన పెంపొందించుకోవాలని, ఈ జ్ఞానాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులతో పంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సెట్కూరు సిబ్బంది మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహారాజ్ మొబైల్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి టిడిపి జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి.



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 12, కడప జిల్లా.** కడప నగరంలోని గుంత బజార్ లో ఆర్. ఎస్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మహారాజా మొబైల్ షాపింగ్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే రెడ్డప్ప మాధవి, టిడిపి జూనియర్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి పాల్గొని, షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ వినియోగదారులకు నాణ్యమైన మొబైల్ ఫోన్లు పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం షాప్ నిర్వాహకులు టిడిపి నాయకులు కార్యకర్తలు మరియు స్థానిక లు పాల్గొన్నారు

# గణేష్ నిమజ్జనం రోజునకు విద్యుత్ శాఖ తగు ఏర్పాట్లు.



**బేతంచెర్ల సెప్టెంబర్ 12 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణము నందు వినాయక చవితి పండుగను పురస్క రించుకొని,గణేష్ మండలాల దగ్గర విద్యుత్ పనులు మరియు వినాయక విగ్రహాలు ఊరేగింపు మొదలు కొని నిమజ్జనం కార్యక్రమం పూర్తిగా జరిగేంత వరకు విద్యుత్ శాఖ అప్రమత్తంగా వుంటూ, ఈ వినాయక చవితి ఉత్సవాలకు, కరెంట్ సమస్యలను వెను వెంటనే పరిష్క రించేందుకు, విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్లు కలిసి పనిలో ఉంటారని విద్యుత్శాఖ ఏడీ. మధు సూదన్ రెడ్డి ప్రతటన ద్వారా శనివారం నాడు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు వినాయక విగ్రహాలకు అడ్డుగా ఉన్నట్లయితే,ఆటంకం కలుగుతుందని తెలిసిన చోట,వెంటనే వాటిని తొలగించుటకు, విధ్యుత్ శాఖ సిబ్బంది సంసిద్ధంగా ఉంటుందని తెలిపారు. విద్యుత్ టౌన్ ఎఈ మరియు సిబ్బందికి తగు సూచనలు చేయడం జరిగింది.

# కడప సౌత్ జోన్ విస్తృతస్థాయి సమావేశం



కడప నగరంలోని హరిత హోటల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ సౌత్ జోన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్క్రీం రవి గారి ఆధ్వర్యంలో పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీ అంజద్ భాష, ఎమ్మెల్సీ శ్రీ రామచంద్రారెడ్డి, మాజీ మేయర్లు శ్రీ కే. సురేష్ బాబు, శ్రీ పాక సురేష్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీ బండి నిత్యానంద రెడ్డి, కడప నియోజకవర్గ అబ్జర్వర్ శ్రీ గురుమోహన్, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ పులి సునీల్ కుమార్, ఈస్ట్ జోన్ అధ్యక్షులు శ్రీ పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి గారు హాజరయ్యారు. కార్యక్రమంలో పలు అంశాలపై ప్రసంగించిన కడప నగర మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి గారు.. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, 12, 13, 15, 20, 21, 23 డివిజన్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# కర్నూలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

## వైఎస్ఆర్సిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడడం, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం లక్ష్యంగా కర్నూలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని నాయకులు పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.

# విశాలాంధ్ర రిపోర్టార్ పై దాడిని ఖండించండి ఎపిడబ్ల్యూజె-- ప్రజా సంఘాలు.

**బేతంచెర్ల సెప్టెంబర్ 12 ( నందిపత్రిక ).** విశాలాంధ్ర రిపోర్టర్ నాగరాజు పై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించిన పత్తికొండ సీఐ జయన్నను,వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే, సిపిఐ,సిపిఎం,వైఎస్ఆర్సిపి, ఎఐఎస్ఎఫ్,ఎఐవైఎఫ్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ నందు శనివారం నిరసన కార్యక్రమం చేశారు. ప్రజాస్వామ్యంలో వాస్తవ విషయాలు వెలికి తీసే,భారత రాజ్యాంగంలో ఫార్త్ ఎస్టేట్ అయిన పాత్రికేతులపై, అసభ్య పద జాలంతో దూశిస్తే పోలీసు అధికారులపై, ఎపి.హై కోర్టులో పిల్ వేయడం జరుగు తుందని నంద్యాల జిల్లా ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ లీగల్ అడ్వైజర్ నందిపల్లె నారాయణ స్రృష్టం చేశారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు కూడా ఈ దాడిని ఖండిస్తూ, ఈ నిరసన కార్యక్రమంలో మాట్లాడటం జరిగింది.



# విద్యారంగా సమస్యలపై పోరాటాలకు సిద్ధం








## రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి 100 కోట్లు నిధులు కేటాయించాలి

## కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలి

**కర్నూలు సిటీ నంది పత్రిక** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక సిఆర్ భవనం నందు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్ జీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ షబీర్ భాష పాల్గొన్నారు అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగశీ లో అనేక సమస్యలతో సతమతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన ప్రభుత్వాలు విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు ప్రోత్సాహం ఇవ్వడం సరికాదన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీలు, వైద్య విద్య ప్రైవేటీకరణ, కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి అంశాలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి, ప్రతి పేద, మధ్యతరగతి విద్యార్థికి సమానమైన విద్యా అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను తిప్పికొట్టి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు కల్పించాలికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి సంఘాల కార్యకలాపాలపై ఆంక్షలు విధించడం వల్ల విద్యార్థుల సమస్యలు వెలుగులోకి రావడం లేదని నాయకులు విమర్శించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు పనిచేయడం ప్రజాస్వామ్య హక్కులో భాగమని అన్నారు.వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, బెడ్లు, పుస్తకాలు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కర్నూలు జిల్లాను కర్నూలు జిల్లాగా ప్రకటించి కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు, రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డిఎస్సి లో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని, ఏ తప్పు జరగనప్పుడు భయమెందుకని నారా లోకేష్ ను ప్రశ్నించారు. రాయలసీమ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టి యూనివర్సిటీ అభివృద్ధికి 100 కోట్లు రూపాయలు నిధులు కేటాయించాలన్నారు అర్ధాంతరంగా నిలిచిపోయిన ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణాన్ని నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేయాలన్నారు ఆదోని మెడికల్ కళాశాల అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణాన్ని పున ప్రారంభించి ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని కోరారు అదేవిధంగా రాయలసీమ యూనివర్సిటీ అనుబంధంగా జిల్లాలో ప్రభుత్వ లా కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు మరియు కర్నూలు జిల్లాలో శాశ్వతంగా హైకోర్టు బెంచిన ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ప్రస్తుత జనరేషన్-జెడ్ విద్యార్థులు తమ హక్కుల కోసం ఒక్కసారి ఐక్యంగా నిలబడి ప్రశ్నిస్తే ప్రభుత్వాలు సైతం తమ విధానాలను పునరాలోచించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. విద్యార్థుల శక్తిని తక్కువగా అంచనా వేయకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. విద్యార్థుల గొంతును అణచివేయడం కాకుండా వారి అభిప్రాయాలను గౌరవించి ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి**

నూతన విద్యా విధానం (ఎన్ఈపి) వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉందని విద్యారంగాన్ని మరింత ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వైపు తీసుకెళ్లే విధానాలను వ్యతిరేకించాలని విద్యార్థుల ప్రయోజనాలు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కర్నూలు జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా నూతన అధ్యక్షుడు గా ఎస్. ఈరేష్ (కోసిగి) ప్రధాన కార్యదర్శి గా బి .రంగస్వామి(కోడుమూరు) వీరితో పాటు 21మంది కార్యవర్గ సభ్యులు, 51మంది జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శి అభిరామ్, అశోక్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్తాఫ్,నాయకులు అర్జున్, సాయి, అఖిల్ , పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో కామ్రేడ్ సీతారాం ఏచూరి కి నివాళి



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 12:** బండి ఆత్మకూరు మండల సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అఖిలభారత సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల పార్టీ కార్యదర్శి రత్నమయ్య అధ్యక్షతన వర్ధంతి సమావేశాన్ని నిర్వహించారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రత్నమయ్య డివిడి రామచంద్రుడు తదితరులు మాట్లాడుతూ సిపిఎం పార్టీ అధినేత కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి జేఎన్ యూలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులుగా సిపిఎం పార్టీ అఖిలభారత కార్యదర్శిగా పార్లమెంటు సభ్యుడుగా దేశంలో బడుగు బలహీన వారి కోసం కృషి చేశారని అన్నారు. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేస్తున్న మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని లౌకిక పార్టీలను కలుపుకొని ఇండియా కూటమి ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని బిజెపి ఆర్ఎస్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు నరసింహులు, సిఐటియు మండల కార్యదర్శి రాజు, ప్రజాసంఘాల నాయకులు సర్దార్ భాష,కౌలు సంఘం నాయకులు ఓబులేసు నారాయణ, శీను,మాల మహానాడు నాయకులు నర్సింహులు, కేవిపిఎస్ నాయకులు సుబ్బయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీనివాస కళ్యాణం మహోత్సవానికి హాజరైన వైఎస్ఆర్సిపి నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కోడుమూరు నియోజకవర్గం లో ఉన్నటువంటి నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ మరియు వారి కుటుంబ సభ్యుల పిలుపు మేరకు శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీనివాస కళ్యాణం మహోత్సవానికి మాజీ కూడా చైర్మన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , కోట్ల చక్రపాణి రెడ్డి , ఎద్దుల మహేశ్వర్ రెడ్డి , ఎద్దుల సూర్య , ఎద్దుల సత్య , కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ , వెంకటగిరి మాజీ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి మరియు ముఖ్య నేతలు తదుపరి హాజరు కావడం జరిగింది. కోట్ల హర్షవర్ధన్ రెడ్డి శ్రీ శ్రీనివాస వెంకటేశ్వర స్వామి వారి కృప ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మరియు అలాగే భక్తుల అందరిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరుతూ వారిని వారి కుటుంబ సభ్యులను అందరినీ ఆప్యాయంగా పలకరించడం జరిగింది.

# నీటికి 'ఎక్స్‌పైరీ డేట్' ఉందా?



ఒకరోజు పాత నీటిని కొందరు పారబోస్తారు.. వారం రోజుల కిందటి నీటిని మరికొందరు తాగుతారు. కానీ, భూమి పొరల్లో వేల సంవత్సరాల క్రితం నిల్వ ఉన్న నీటిని మాత్రం అత్యంత స్వచ్ఛమైనదిగా భావిస్తాం. అయితే, అసలు నీటికి ఎక్స్‌పైరీ డేట్ ఉంటుందా? వాస్తవానికి నీటికి శాస్త్రీయంగా ఎలాంటి ఎక్స్‌పైరీ డేట్ ఉండదు. మన సౌకర్యాన్ని, లభ్యతను బట్టి మనమే దానికి ఒక కాలాన్ని నిర్ణయించేస్తుంటాం. దైనందిన జీవితంలో నీటి పట్ల మన ఆలోచనా ధోరణి పరిస్థితులను బట్టి ఎలా మారుతుందో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది: **నగరాల్లో:** మున్సిపల్ కుళాయిల ద్వారా ప్రతిరోజూ నీరు వచ్చే ప్రాంతాల్లో నిన్న పట్టుకున్న నీటిని 'పాసిపోయింది' అని పారబోస్తుంటారు. వీళ్ల దృష్టిలో నీటి ఎక్స్‌పైరీ డేట్ ఒక్క రోజు మాత్రమే.నీటి ఎద్దడి ప్రాంతాల్లో: వారానికోసారి లేదా పది రోజులకోసారి నీరు సరఫరా అయ్యే ప్రాంతాల్లో, పట్టుకున్న నీరు ఎన్ని రోజులైనా స్వచ్ఛంగానే ఉంటుంది. ఎవరూ పారబోయరు.శుభకార్యాల్లో: టేబుల్ మీద కొత్త వాటర్ బాటిల్ తెరవగానే, పక్కనే ఉన్న పాత బాటిల్‌ను పనికిరానిదిగా వదిలేస్తారు. ఇక్కడ నీటి ఎక్స్‌పైరీ డేట్ కొన్ని నిమిషాలు లేదా గంటలకు మాత్రమే పరిమితం. **ఎడారిలో:** ప్రయాణించేటప్పుడు తదుపరి నీటి వనరు దొరికే వరకు ఫ్లాస్క్‌లో ఉన్న ప్రతి నీటి చుక్కా అమృతంతో సమానమే.

**ప్రకృతిలో:** డ్యామ్‌లు, చెరువుల్లో నిల్వ ఉండే నీరు వర్షాభావ పరిస్థితుల్లో ఏళ్ల తరబడి వాడుకలోనే ఉంటుంది. **భూగర్భంలో:** బోర్ల ద్వారా వందల అడుగుల లోతు నుంచి మనం తోడే నీరు వేల సంవత్సరాల నాటిది కావచ్చు. అయినా దాన్నే మనం అత్యంత సురక్షితమైనదిగా భావించి తాగుతున్నాం.దీన్నిబట్టి అర్థం చేసుకోవాల్సిన నిజం ఒక్కటే. నీటి కాలపరిమితిని నిర్ణయించేది మన ఆలోచన, లభ్యత మాత్రమే. నీరు సులభంగా దొరికినప్పుడు దాని విలువ తెలియదు, కరవు వచ్చినప్పుడు అదే ప్రాణాధారం అవుతుంది.ప్రకృతిలో నీరు అంతరించిపోకముందే మేల్కొందాం. మన అజాగ్రత్త భవిష్యత్తు తరాలను దాహంతో అలమటించేలా చేయకూడదు. నీటిని బాధ్యతగా, పొదుపుగా వాడుకుందాం. జలమే జగతికి మూలాధారం, నీరుంటేనే రేపటి భవిష్యత్తు ఉంటుందని గ్రహిద్దాం. **సేకరణ: పెరుమాళ్ళ వెంకట సురేంద్ర (రుద్రవరం ప్రతినిధి)**

# టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ల రాజేష్



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 12 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ గారిని ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ల రాజేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫయాజ్ గారిని గోళ్ల రాజేష్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక రంగ అభివృద్ధి తదితర అంశాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ సామగ్రి బహూకరణ



**మర్రిపాడు సెప్టెంబర్ 12నంది పత్రిక :** రాజుపాలెం గ్రామంలో వెలసివున్న శ్రీ వెంకటేశ్వర స్వామివారికి దాతలు ప్రత్యేక అలంకరణ సామగ్రిని భక్తిశ్రద్ధలతో బహూకరించారు.స్వామివారి అలంకరణ కోసం మకరతోరణం,కిరీటం,వక్షస్థల కవచం, హస్తాలు,పాదాలు తదితర ఆభరణాలను సమర్పించారు.మకరతోరణాన్ని హరిహరపు వెంకటేశ్వర్లు,నారాయణమ్మ దంపతులు బహూకరించగా, కిరీటం,వక్షస్థలం, హస్తాలు,పాదాలు తదితర అలంకరణ సామగ్రిని బిల్లు పాటి రామయ్య,రాధమ్మ దంపతులు సమర్పించారు.ఈ సందర్భంగా దాతలు సమర్పించిన నూతన అలంకరణ సామగ్రితో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.దేవస్థాన ప్రధాన అర్చకులు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వివిధ రకాల అభిషేకాలు,అర్చనలు,హారతులు,ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నూతన అలంకరణ సామగ్రితో స్వామివారు సర్వాంగ సుందరంగా దర్శనమివ్వడంతో భక్తులు ఎంతో ఆనంద పరవశు లయ్యారు.పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.స్వామివారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా వారు తెలియచేశారు.

# జర్నలిస్టు పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐ జయన్న ను సస్పెండ్ చేయాలి




**కర్నూలు, సెప్టెంబర్ 12. నంది పత్రిక:** వార్త కవరేజ్ కోసం పత్తికొండ అర్బన్ స్టేషన్ కు వెళ్ళిన జర్నలిస్టు నాగరాజు ను దుర్భాషలాడమే కాకుండా మెడపట్టి గెంటేసిన అర్బన్ సీఐ జయన్న ను వెంటనే సస్పెండ్ చేయాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు ఈ.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వెంకట సుబ్బయ్య, కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణారెడ్డి, భాష్యం మధు సుధన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, నగర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ నాగేశ్వర రావు, బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల పరిధిలోని పందికోన లో ప్రేమ విషయమై అమ్మాయి తరుపున బంధువులు అబ్బాయి బంధువులు పై దాడి చేయడం జరిగిందన్నారు. దీంతో అబ్బాయి బంధువులు స్టేషన్ ముందు ధర్నాకు దిగారన్నారు. ఇది తెలుసుకున్న అమ్మాయి బంధువులు కూడా ధర్నాకు దిగారన్నారు. సీఐ ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టు నాగరాజు స్టేషన్ లోకి వెళ్ళడం జరిగిందన్నారు. ఇది గమనించిన సీఐ బయటకు వెళ్లాలని దబాయించడం జరిగిందన్నారు. జర్నలిస్టు అని చెబుతున్నా.. రాయలేని భాష లో నానా దుర్భాషలాడుతూ.. మెడపట్టి గెంటేయడం దుర్మార్గమన్నారు. స్టేషన్ ప్రజలదని, అందరూ స్వేచ్ఛగా వెళ్ళి వచ్చే ప్రదేశమని, అలాంటి చోటుకు రావొద్దని గెంటేయడం బాధాకరం అన్నారు. స్టేషన్ ఆయన సొంతమా..? అని ప్రశ్నించారు. సొంతమైతే ఎవరు కూడా అటు వైపు వెళ్లారన్నారు. గతంలో కూడా జర్నలిస్టుల పట్ల ఇదే విధంగా వ్యవహరించడం, తప్పుడు కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఇదే విషయం గతంలో జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు.

అయినా ఎలాంటి చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ సీఐ జయన్న వ్యవహారశైలి, స్టేషన్ లో జర్నలిస్టుల, ప్రజల పట్ల ఆయన వ్యవహరిస్తున్న తీరుపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులను కూడాగట్టి ఛలో పత్తికొండ నిర్వహిస్తామని, సస్పెండ్ చేసేంతవరకు పోరాడుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్నేహల్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జర్నలిస్టు యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## డి. కొట్టాలలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 12 (నంది పత్రిక):** రుద్రవరం మండలం డి.కొట్టాల గ్రామంలోని శ్రీ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు (ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ) ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీశ్రీ నిత్యతృప్తదాస్ స్వామీజీ చేసిన రామాయణ, మహాభారత, భగవద్గీత ప్రవచనాలు, స్థానిక మండలి భజనలు భక్తులను ఎంతగానో అలరించగా, అర్చకులు సత్యనారాయణశర్మ నేతృత్వంలో భక్తులు గోవును సర్వాంగ సుందరంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, గోపూజను ఘనంగా నిర్వహించారు. సమాజంలో భక్తిచింతన పెరిగినప్పుడే అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ముగింపు వేడుకల్లో పెద్దపల్లి బ్రహ్మానందరెడ్డి, నరసింహారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాముడు, కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, దస్తగిరిరెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఘనంగా ప్రారంభమైన ఆరవ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్





**టోర్నమెంట్ ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ.**

**టోర్నమెంట్ వేదిక నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్**

**22 జిల్లాల నుండి పాల్గొన్న 300 మంది చదరంగం క్రీడాకారులు**

**6,8,10,12,14,16 లోపు వయసు ఆరు విభాగాలలో ఓపెన్ మరియు బాలికలకు పోటీల నిర్వహణ**

**బహుమతుల కోసం లయన్స్ క్లబ్ యూత్ బ్యాచ్ పదివేల విరాళం**

నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 12 . (నంది పత్రిక ):ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల చెస్ సంఘం నిర్వహణలో శనివారం స్థానిక టేక్కె ప్రాంతంలో ఉన్న నెరవాటే ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో ఆరవ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని టోర్నమెంట్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాల చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాలలో తరచూ చెస్ టోర్నమెంట్లునిర్వహించడంఅభినందనీయమని, నంద్యాలలో ప్రతి ఏటా రాష్ట్రస్థాయి టోర్నమెంట్లు నిర్వహించడం నంద్యాలకు గర్వ కారణం అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు మొబైల్ స్క్రీన్ టైం తగ్గించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద ఎక్కువ ఆధారపడకుండా, వారి మెదళ్లకు పదును పెడుతూ వారి లోని సృజనాత్మక శక్తులను ప్రోత్సహించాలన్నారు. బాలల మేధాశక్తిని చెస్ క్రీడ పెంపొందింప చేస్తుందని అన్నారు.నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల డైరెక్టర్ నెరవాటి ఆనంద్ గుప్తా కరస్పాండెంట్ నెరవాటి కృష్ణ సాయి రోహిత్ మాట్లాడుతూ చదరంగం క్రీడ విద్యార్థులలో ఏకాగ్రతను ఇనుముడింప చేస్తుందని , చెస్ క్రీడల నిర్వహణకు తమ పాఠశాల ఎప్పుడు సహకారం అందజేస్తుందని అన్నారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, లయన్స్ జిల్లా పిఆర్ఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ యువజన బ్యాచ్ తరపున ఈ టోర్నమెంట్ లో బహుమతుల కోసం పదివేల రూపాయలు విరాళం అందజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా చెస్ టోర్నమెంట్ల నిర్వహణకు లయన్స్ క్లబ్ సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

నంద్యాల జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 22 జిల్లాల నుండి 250 మంది చదరంగం క్రీడాకారులు ఈ ఆరవ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ లో పాల్గొంటున్నారని, 6,8,10,12,14,16 లోపు వయసు ఆరు విభాగాలలో ఓపెన్ మరియు బాలికల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు జాతీయస్థాయిలో జరిగే చెస్ పోటీలలో రాష్ట్ర జట్టు లో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు, డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున రావు,నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ నెరవాటి ఆనంద్ గుప్తా, కరస్పాండెంట్ నెరవాటి కృష్ణ సాయి రోహిత్, లయన్స్ క్లబ్ నంద్యాల అధ్యక్షులు సందీప్, కార్యదర్శి మేడా చంద్రశేఖర్, జిల్లా పి ఆర్ ఓ సుధాకర్ రెడ్డి, చెస్ నంద్యాల సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి,కోశాధికారి శ్రీనిష్, టోర్నమెంట్ ఆర్బిటర్లు కిరణ్, స్పందన,నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు వాసు,జగన్, కిరణ్ లాల్, చెస్ శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ్, మాలిక్ ,నరసింహ, వెంకట్,క్రీడాకారుల తల్లిదండ్రులు,వివిధ జిల్లాల సంఘాల కార్యదర్శులు, పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం





**టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్**

**కల్పనా సెంటర్, టెక్కే మార్కెట్ యార్డ్ వద్ద ఘనంగా ఉచిత మట్టి గణపతుల పంపిణీ**

**పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 12 ( నంది పత్రిక ) వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్టించి పూజించాలని టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల పట్టణంలోని కల్పనా సెంటర్ మరియు టెక్కే మార్కెట్ యార్డ్ వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ విగ్రహాల పంపిణీని ప్రారంభించి, స్థానిక ప్రజలకు, భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో చేసిన విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని అన్నారు . మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూనే, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకువస్తూ, ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమ నిర్వాహకులు గోళ్ళ రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారి ఆశీస్సులతో, నంద్యాల ప్రజలందరి కుటుంబాలలో సర్వ విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు వెల్లివిరియాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మట్టి వినాయకులనే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, అనుపూరి ఈశ్వర్, నూర్ భాషా, మనీష్ రెడ్డి, గోవింద నాయుడు, మురళి, దీపక్ రెడ్డి, అశోక్, ఉప్పరి సురేష్, బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, స్వామి నాయక్, రాజా, ప్రహ్లాద్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు.





## సీతారాం ఏచూరి ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

**సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసురత్నం, ఆవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ**

వెలుగోడు, సెప్టెంబరు 12 (నంది పత్రిక):దేశంలోని కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఘనమైన నివాళి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసురత్నం, ఆవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ అన్నారు. వెలుగోడు పట్టణంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయం నందు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజల పక్షాన నిరంతరం పోరాడిన ఏచూరి: వి. ఏసురత్నంసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసురత్నం మాట్లాడుతూ... కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంటులోనూ, ప్రజా ఉద్యమాల్లోనూ ఆయన బలమైన గొంతుకగా నిలిచారని అన్నారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఏచూరి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటి ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించిన కార్మికులు, రైతులు, ఉద్యోగులు, పేదల సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల అంటూ కొనియాడారు.మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం: మహమ్మద్ రఫీఆవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసిన గొప్ప ప్రజా నాయకుడని అన్నారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. పేదలు, మైనార్టీలు, కార్మికులు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఏచూరి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఉపాధి భద్రత లేకపోవడం, కార్మికుల హక్కులపై దేశంలో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను విస్తృతం చేసిన ఏచూరి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో స్థానిక, కార్యకర్తలు వెంకటయ్య, ఎర్రబాషా, గాడిద మల్లభాష, అంజి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



## రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే గిత్త జయసూర్య**





కొత్తపల్లి - నంది పత్రిక : రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్మణి ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సాగుయంత్రాల కేంద్రం, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ సాగుయంత్రాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య పాల్గొని సాగుయంత్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్ర పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించి, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతులు సాంకేతికతను, ఆధునిక యంత్రాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని, రైతులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తాన్నారు అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కొకరంచ గ్రామానికి చెందిన, ఉదయవాణి రూ.20,000/- దుద్యాల గ్రామానికి చెందిన, శంకర్ బాయ్ రూ.31,734/- ఎర్రమట్టం గ్రామానికి చెందిన రమాదేవికి రూ.48,734/- మంజూరైన చెక్కులను కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ నారపురెడ్డి, మాజీ మండల కన్వీనర్ బుచ్చిరెడ్డి, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మండల అధికారులు ఎమ్మార్వో ఉమారాణి, ఎంపీడీవో మేరీ , స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామం డిప్యూటీ ఎంపీడీవో కె .పి శర్మ , ఏపీఎం పుల్లయ్య టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళ సమాఖ్య సభ్యులు రైతులు పాల్గొన్నారు




## అన్నపూర్ణ అనాధ శరణాలయం పిల్లలకు స్పోర్ట్స్ స్కిట్లు బట్టలు పంపిణీ-- బిజెపి బేతంచెర్ల.



బేతంచెర్ల సెప్టెంబర్ 12 ( నందిపత్రిక ). బిజెపి బేతంచెర్ల మండల కమిటి ఆధ్వర్యంలో, బేతంచెర్ల పట్టణ శివారులో గల అన్న పూర్ణ చిన్న పిల్లల అనాధ శరణాలయం లో ఉన్న చిన్న పిల్లలకు బేతంచెర్ల మండల అధ్యక్షులు గాజుల రమేష్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఉన్నం మనోహర్, ఎమ్మిగనూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగి కోటేశ్వర రావుల సహకారంతో పది వేల రూపాయలు విలువ చేసే స్పోర్ట్స్ కిట్లు,అలాగే బేతంచెర్ల బిజెపి.టౌన్ ఉపాధ్యక్షుడు టైలర్ రాముడు పది వేల రూపాయలు విలువ చేసే బట్టలను శనివారం నాడు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగమోహన్ రెడ్డి, మండల నాయకులు జీవన్ చౌదరి, ధార్మిక స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు లైఫ్ శీను,అజయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : కోట్ల సూర్య

డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 12 డోన్ మండలం చింతలపేట గ్రామంలో తాగునీటి సమస్య గురించి విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ రోజు గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే , సంబంధిత అధికారులను వెంటనే గ్రామానికి పిలిపించి నీటి సరఫరా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడేది లేదని, చింతలపేట గ్రామ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలి..!

### అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలి: కడప ఆర్డీఓ



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12: నంది పత్రిక** వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, పర్యావరణ హితంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి మురళి సూచించారు. శనివారం కడప ఆర్డీవో కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ డివిజన్ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఆర్డీవో మురళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.వినాయక విగ్రహాల తయారీలో మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని నివారించాలని సూచించారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భద్రత, పారిశుధ్యం తదితర అంశాల్లో సంబంధిత నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు.ఉత్సవాల సందర్భంగా అధిక శబ్దం, బాణసంచా వినియోగాన్ని నియంత్రిస్తూ నిర్ణీత నిబంధనలు, సమయాలను పాటించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఊరేగింపుల మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, తగినంత వెలుతురు, భద్రతా చర్యలు, పారిశుధ్య ఏర్పాట్లు కల్పించాలని ఆర్డీఓ సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిమజ్జనం అనంతరం పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్, పోలీసు, విద్యుత్, అగ్నిమాపక, వైద్య, పర్యావరణ, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డయాగ్నొస్టిక్ బ్లాక్ 3వ, 4వ అంతస్తుల్లో ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పీఎం –అభిమ్ నిధులతో ఏర్పాటు చేసిన నూతన క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.రాష్ట్రం లోని పలు కీలక ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్‌లను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి విజయవాడ నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ క్వామర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు నూతన క్రిటికల్ కేర్ బ్లాక్‌లోని వివిధ వార్డులను ప్రారంభించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు.ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న తీవ్ర అనారోగ్య రోగులకు మెరుగైన వైద్య సేవలు, ఆధునిక చికిత్సా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. కె. చిట్టి నరసమ్మ, ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారులు, ఏపీఎంఎస్‌ఐడీసీ సిబ్బంది, వైద్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఈ డి





**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 12 నంది పత్రిక** ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోను శనివారం కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకిశోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కార్యాలయం, గ్యారేజ్‌ను ఆయన తనిఖీ చేశారు. బస్ స్టేషన్ లోని టాయిలెట్లు తనిఖీ చేసి వాటిని పరిశుభ్రంగా నిర్వహించాలని అలాగే యూపీఐ ద్వారా టాయిలెట్ వినియోగ రుసుము చెల్లింపు గురించి ఆరా తీశారు బస్టాండ్ నందు స్టాళ్లను తనిఖీ చేసి ఎమ్మార్పీ ధరలకు వస్తువులను తప్పనిసరిగా విక్రయించాలని స్టాళ్లను నిర్దేశించిన స్థలంలో శుభ్రముగా ఉంచుకోవాలని వారికి సూచించారు ఆర్టీసీ బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా సరైన సమయానికి ఇవ్వాలని డ్రైవర్, కండక్టర్ సర్వీస్ చేసేటప్పుడు ఓర్పుతో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా డ్యూటీ చేయాలని బస్టాండ్ నందు డ్రైవర్ బస్సును రివర్స్ చేసేటప్పుడు కండక్టర్ బస్సు వెనక్కి వెళ్లి చూడాలని అలాగే కండక్టర్ డ్యూటీ చేసేటప్పుడు దూర వద్ద ఉన్న ప్రయాణికులను బస్సు లోపలికి పంపవలెను తెలిపారు డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లు ఓర్పుతో స్టేజీల వద్ద బస్సు నా అభిప్రాయాన్నికులను ఎక్కించుకోవాలని ఆయన సూచనలు చేశారు అలాగే సంస్థ పురోభివృద్ధి కోసం ఉద్యోగులు, కార్మికులు అంకితభావంతో పని పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ( ఎన్ఎంయు) నాయకులు ఈ. డి. ని కలిసి డిపో సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్ ఎం రజియా సుల్తానా, డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌తో త్వరితగతిన కేసుల పరిష్కారం.. !



**డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్**

**ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత..**

**రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల పంపిణీ**

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12: నంది పత్రిక** జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు న్యాయాధికారులు, పోలీసులు, న్యాయవాదులు, పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రామ్ గోపాల్ కోరారు. శనివారం కడప జిల్లా కోటు సముదాయ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్ గోపాల్.. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తోపాటు జిల్లా 4వ అదనపు న్యాయమూర్తి జి.ఎస్. రమేష్ కుమార్, డిఎల్ఎస్ఏ సెక్రెటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందేలా కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ చేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ప్రమాదాలకు సంబంధించిన పలు కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఏడవ అదనపు జిల్లా న్యాయస్థానంలో జరిగిన ఒక కేసులో రూ 1.20 కోట్ల పరిహారం మంజూరయ్యేలా పరిష్కారం జరిగిందన్నారు. లక్ష్మీ ప్రసన్న అనే యువతి పిల్లలతో కలిసి ప్రయాణిస్తున్న సమయంలో కాజీపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అయితే న్యాయపరంగా అందాల్సిన పరిహారం త్వరితగతిన అందేలా కేసును పరిష్కరించడం అభినందనీయమన్నారు.అదేవిధంగా మొదటి అదనపు జిల్లా న్యాయస్థానంలో శ్రీధర్‌రెడ్డి మృతి చెందిన కేసులో ఆయన భార్య, చిన్నారి కుటుంబానికి రూ.1.30 కోట్ల పరిహారం అందేలా కేసు పరిష్కరించబడిందన్నారు. న్యాయవాదులు, బీమా సంస్థ సహకారంతో పాటు న్యాయమూర్తుల చొరవతో ఈ కేసులు త్వరితగతిన పరిష్కారం కావడం అభినందనీయమన్నారు. ప్రొద్దుటూరులోనూ రూ.1.05 కోట్ల పరిహారానికి సంబంధించిన మరో కేసు పరిష్కారమవుతున్నట్లు తెలిపారు. ఈ కేసుల పరిష్కారంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత..** దేశంలో ప్రతిరోజూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్నారులు, యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి



చెందితే ఆ కుటుంబం పడే బాధను ఎవరూ తీర్చలేరని అన్నారు. ఒక హత్య జరిగినప్పుడు సమాజం తీవ్రంగా స్పందిస్తుందని, అదే రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినప్పుడు మాత్రం అంతగా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మరణం మరణమేనని, కుటుంబ సభ్యులు, పిల్లలు పడే బాధ ఒకటేనని అన్నారు. మన కళ్లెదుటే ఇంతమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నప్పుడు ప్రమాదాలను నివారించేందుకు మన వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటించి, బాధ్యతాయుతంగా వాహనాలు నడిపితే ప్రమాదాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందన్నారు.భవిష్యత్తులో జిల్లా కలెక్టర్, ఎస్పీ, న్యాయవాదులు, పోలీసులు, న్యాయ సేవాధికార సంస్థల సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత రోడ్డు భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది, పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

## అదిగదిగో సంగమేశ్వరాలయ శిఖర దర్శనం

**-బయల్పడుతున్న సంగమేశ్వరాలయం**

**-కనువిందు చేస్తున్న ఆలయ శిఖర భాగం**



**కొత్తపల్లి – నంది పత్రిక:** శ్రీశైలం జలాశయం మొత్తం నీటిమట్టం 885 అడుగులు. అయితే శ్రీశైలం జలాశయం వెనుక జలాలలో మండలంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన ప్రాచీన సంగమేశ్వరాలయం ఆగష్టునెల 6వ తేదిన జలాధీవాసంలోకి వెళ్లింది. అయితే ఎగువప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు రావడంలేదు. దీనికి తోడు ముచ్చుమరి, మల్యాల, వెలిగొండ ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్నుంచి కృష్ణాజలాల నీటి విడుదల కొనసాగుతుంది. దీంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగుల నుంచి 865 అడుగులకు చేరుకుంది. దీంతో వెనుకజాలలో జలాదీవాసం అయిన సంగమేశ్వరాలయ శిఖరభాగం శనివారం కృష్ణాజలాలనుంచి బయల్పడుతుంది. దీంతో దూరంనుంచి చూసి భక్తులు, సందర్శకులు' అదిగదిగో సంగమేశ్వరాలయ శిఖరం అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జలాలపై తెలియాడుతున్నట్లుగా ఆలయ శిఖర భాగం కనువిందు చేస్తుంది. కాగా జలాధీవాసం అయిన నెలరోజులకే మరల ఆలయ శిఖర దర్శనం కావడంతో భక్తులు, సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ శిఖరభాగానికి ప్రత్యేక పూజలు చేసి కాషాయపు జెండాను గుర్తుగా కట్టారు.



## "వైద్య పరిజ్ఞానం ఆధునిక సాంకేతికత, పరిశోధన, అనుభవాలు మేళవింపు పంచుకునే వేదికలే వైద్య సదస్సు లు డాక్టర్ పి చంద్రశేఖర్ వైస్ చాన్స్ లర్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ




**కర్నూల్ సిటీ నంది పత్రిక** "44వ ఈఎన్టీ రాష్ట్రస్థాయి సదస్సును ప్రారంభించిన హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్"... రాష్ట్రంలో వైద్య విద్యలో పరిశోధనలకు అధునాతన పరికల్పనలకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని అందులో భాగంగానే వైద్యశాస్త్రలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ పి చంద్రశేఖర్ అన్నారు. శనివారం కర్నూల్ మెడికల్ కాలేజీలో జరుగుతున్న 44వ ఈఎన్టీ రాష్ట్రస్థాయి సదస్సును ఆయన ప్రారంభించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సదస్సులు అంటే కేవలం సమావేశాలు కాదని అందులో వైద్యరంగంలో వస్తున్న అధునాతన మెలకువలు నూతన ఆవిష్కరణలు ఎప్పటికప్పుడు ఆ రంగంలోని వైద్యులకు అందించేందుకు ఈ సదస్సులు కృషి చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సెషన్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నామని పరిశోధనలకు యూనివర్సిటీ ఆర్థిక తోడ్పాటు కూడా అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఈఎన్టీ వైద్య నిపుణులు, వైద్యులు, పీజీ విద్యార్థులు ఈ సదస్సుకు హాజరయ్యారు.. ఈ సమావేశంలో ఈఎన్టీ విభాగంలో విశిష్ట సేవలు విశిష్ట సేవలు అందించినందుకు గాను డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ సింగరి ప్రభాకర్ కు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందజేయడం జరిగింది. మొదటి రోజు ఐదు ప్రీ-కాన్ఫరెన్స్ వర్క్‌షాప్ లుమ్యానికిన్స్, షీప్ లంగ్, పిగ్ లంగ్‌పై బ్రాంకోస్కోపీ, షీప్ హెడ్‌పై ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ, కోబ్లేషన్ ట్రైనింగ్, ఫేషియల్ ప్లాస్టిక్స్‌యఫ్ ఏ సి ఈ -ఐ టీ , కోత కుట్టి లేకుండా ఇంటర్నేషనల్ స్థాయిలో అధునాతన ప్రొసీజర్ తో వైద్య విధానాలపై శిక్షణ, సియాలెండోస్కోపీ వంటి ఆధునిక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. అదేవిధంగా పీజీ విద్యార్థులు 76 కేస్ ప్రజెంటేషన్లు, 34 కేస్ సిరీస్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. ఈ రాష్ట్రస్థాయి ఈఎన్టీ సదస్సుకు మొత్తం 514 మంది నమోదు చేసుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ చైర్మన్ డా. నందకిషోర్,కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ & అడిషనల్ డీఎంఈ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ మరియు ఈఎన్టీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జయ ప్రకాష్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## సెప్టెంబర్ 14న ఉమ్మడి కర్నూలు జిల్లాలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె . రామకృష్ణ కరువు పర్యటనను జయప్రదం చేయండి.



**కర్నూలు సిటీ నంది పత్రిక** సెప్టెంబర్ 14వ తేదీన సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఉమ్మడి కర్నూలు జిల్లాలో డోను,ప్యాపిలి, పత్తికొండ,ఆలూరు ప్రాంతాలలో పర్యటిస్తున్నారని,గత నాలుగు నెలల కాలం నుండి వర్షాలు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని దీని కారణంగా రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అప్పుల పాలవుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కరువు జిల్లాగా ప్రకటించి కరువు సహాయక చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం కోసం పంటలను పరిశీలన చేయడం,ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, ప్రజలకు సిపిఐ అండగా ఉంటుందని ఆత్మస్థైర్యం కల్పించడం జరుగుతుందని ఈ పర్యటనలో ప్రజలు, రైతులు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యదర్శులు బి.గిడ్డయ్య ఎన్.రంగనాయుడు లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## విద్యార్థులు ప్రజలను దృష్టిలో ఉంచుకొని రాత్రి 8 గంటలకి ఆర్టిసి బస్సును ఏర్పాటు చేయండి

**ఆత్మకూరు నుండి కొక్కిరంచకు ఆర్టీసీ బస్సును రాత్రి 8 గంటలకు కొనసాగించాలి. ప్రజా సంఘాలు, డిమాండ్:**



**నంది పత్రిక ఆత్మకూరు..** ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు ల సంఘం, మాల మహానాడు నాయకులు పాతకోట రమేష్, నాగరత్నం మరియు గ్రామ ప్రజలు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ ఆర్ కె. కిషోర్ ఆత్మకూరు నుండి కొక్కెరంచ గ్రామానికి గతంలో కొన సాగుతున్నది. ప్రస్తుతం ఆ బస్సును రద్దు చేయడం జరిగింది. ఉదయం నుంచి చదువుకు నే మరియు రైతులు మరియు ప్రజలు తమ అవసరాల కోసం నిత్యం ఆత్మకూరు వస్తూ ఉంటారు. మరి తిరుగు ప్రయాణంలో సాయంత్రం ఐదు గంట ల కె ఆర్టీసీ బస్సును బందు చేయడంతో చదువుకునే 8 9 10 వ తరగతి చదువుకునే , విద్యార్థిని విద్యార్థులు , మరి రైతులు, తీవ్రమైన ఇబ్బందికి గురవుతున్నారని, వెంటనే రాత్రి 8 గంటలకు ఆర్టీసీ బస్సును కొనసాగించాలని, అట్లాగే శ్రీశైలానికి బస్సులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని శ్రీశైలానికి అదనంగా బస్సులు నడపాలని, నంద్యాల సర్వీసులు కూడా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నాలుగు సర్వీసు బస్సులను అధికంగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని వారన్నారు. అనంతరం ఆర్ ఆర్ కె కిషోర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినతిపత్రాన్నిసమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాల మహానాడు పాలమరి రమేష్,, నాగరత్నం, బలరాం, గ్రామ ప్రజలు, విద్యార్థులు రైతులు సామాన్య ప్రజలు చిన్న చిన్న వ్యాపారం చేసుకునే కార్మికులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆర్టీసీ ఈడీ స్పందిస్తూ ఆర్టీసీ బస్సులను పెంచే దానికి హామీ ఇవ్వడం జరిగింది. అభివందనంతో ఏపీ కౌలు రైతుల సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుధాకర్.

## కొలను భారతి క్షేత్ర అభివృద్ధి చేస్తాం

**- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం**

**- ఎమ్మెల్యే గిత్త జయసూర్య, శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు**

**సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య**





**కొత్తపల్లి – నంది పత్రిక :** శ్రీశైలం దత్తత దేవాలయమైన కొలను భారతి క్షేత్రన్నీ అభివృద్ధి చేస్తామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గిత్త జయసూర్య, శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు అన్నారు శనివారం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పుణ్యక్షేత్రమైన కొలనుభారతి క్షేత్రంలో ఆలయ అభివృద్ధి సమీక్ష సమావేశాన్ని ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్య నిర్వహించిన సమావేశనికి ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారి, భక్తుల సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే కొలను భారతి క్షేత్ర అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, వాటి ప్రాధాన్యత, త్వరితగతిన పూర్తి చేయాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యం కొలను భారతి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు ఆధ్యాత్మికంగా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ నారపరెడ్డి, మాజీ మండల కన్వీనర్ జెడ్ వెంగళ రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మాజీ సర్పంచ్లు చంద్రశేఖర్,నక్క విజయ్ కుమార్ మండల అధికారులు ఎమ్మార్వో ఉమారాణి, ఎంపీడీవో మేరీ, ఏపిఎమ్ పుల్లయ్య, టిడిపి మండల నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు




## కార్మిక కర్షకుల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళి : సిపిఎం

**కొత్తపల్లి – నంది పత్రిక** : కార్మిక కర్షకుల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్ స్వాములు సీనియర్ నాయకులు ఎస్ సంజీవ రాయుడు అన్నారు. సిపిఎం పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా సింగరాజు పల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కార్మిక వర్గానికి రైతాంగానికి దేశ ప్రజలకు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటు అన్నారు విద్యార్థి దశ నుండి అంచలంచలుగా ఎదిగి మూడుసార్లు సిపియం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై రాజ్యాంగాన్ని రక్షించేందుకు మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ లౌకికవాద స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశ రాజకీయాల్లో, ప్రపంచ రాజకీయాలలోచెరగని ముద్ర వేశారని అన్నారు. నడుస్తూ నడిపించారు నిజమైన ప్రజానేతగా నిలిచారు. మీ రూపం మా ఎదురుగా లేకపోయినామీ మాటలు, మీరందించిన స్ఫూర్తి నిత్యం వెంటాడుతాయి మీ ఆశయాల బాటలోనడిచేందుకు దారిచూపుతామన్నాడు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎన్ దాసు పి ఏసన్న, ఎన్ గోపాల్, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, సోమేశ్, నరేష్, శ్రీను లింగన్న తదితరులు పాల్గొన్నారు.



## మట్టి విగ్రహాల్ని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

**ప్రధానోపాధ్యాయులు కౌసల్యా బాయి**



**నందికొట్కూరు సెప్టెంబర్ 12( నంది పత్రిక)** పట్టణంలోని స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – కోట బాలురు నందు విద్యార్థులు స్వయంగా మట్టి గణేషుని విగ్రహాలను తయారు చేయడం చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌసల్యా బాయి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో విగ్రహాలు తయారు చేయడం వలన ప్రకృతి కి,పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అందుకే మట్టి విగ్రహాలు వినియోగించాలని వాటి వల్ల పర్యావరణానికి ఎటువంటి హానీ వాటిల్లదని ప్రజలకు తెలిపే ప్రక్రియ లో భాగంగా విద్యార్థులు ఈ మట్టి విగ్రహాల్ని తయారు చేశారని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన సమాజానికి ఒక మంచి సందేశం వెళ్తుందని, విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత బయటపడుతుందని,సమాజం పట్ల వారికి మరింత బాధ్యతను పెంపొందింప చేస్తుందని తెలిపారు. అలాగే ప్రస్తుతం 'ఎల్ నినో ' ప్రభావం వలన నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడి ని దృష్టిలో పెట్టుకుని నీటిని వృధా చెయ్యకుండా పొదుపుగా వాడాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సమాజ హితం కోరి మట్టి విగ్రహాల ద్వారా మంచి సందేశం ఇస్తున్న విద్యార్థులను అభినందిస్తూ వాటిని తయారు చేసిన వారికి చిరు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని లు సాలమ్మ,విజయకుమారి,సరిత,లలితమ్మ, సరోజిని దేవి, లలితకుమారి, సుజాత ఉపాధ్యాయులు ఈశ్వరయ్య , శ్రీనాథ్, మల్లికార్జున రెడ్డి,వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, నాగశేషులు, మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి.




**బేతంచెర్ల సెప్టెంబర్ 12 ( నంది పత్రిక ).** బేతంచర్ల సీఐటీయూ కార్యాలయంలో సిపిఎం పార్టి జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ప్రజల కోసం నిత్యం పోరాడుతూ.ఆయన అందించిన సేవలు మరువ లేనివని సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడు వై.ఎల్లయ్య, సిపిఎంపార్టీ బేతంచెర్ల పట్టణ కార్యదర్శి బి.రామాంజనేయులు అన్నారు.ఆయన ఆశయ సాధనం కోసం ప్రతి ఒక్క సిపిఎం పార్టీ సభ్యుడు కృషి చేయాలని కోరారు.శనివారం ఆయనను స్మరించుకొని,ఏచూరుకి ఘనంగా నివాళులు అర్పించారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక పంపిణీ

**ఇద్దరు విద్యార్థులకు చెరో రూ.6 వేల చొప్పున ఆర్థిక సహాయం.**

**డైమండ్ జూబ్లీ వేడుకల నిర్వహణపై కమిటీల ప్రగతిని సమీక్షించిన పూర్వ విద్యార్థులు**



**వెలుగోడు, సెప్టెంబర్ 12 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన మెరిట్ విద్యార్థులకు అవార్డులు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డైమండ్ జూబ్లీ వేడుకల నిర్వహణలో భాగంగా నాలుగో సారి పూర్వ విద్యార్థుల చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులకు చెరో రూ.6,000 చొప్పున మంజూరు.గతంలో అందించిన అభినందన సభలో మెరిట్ ఆధారంగా ఎంపికైన సయ్యద్ ఖాజిమ్ హుస్సేన్, షేక్ ఫర్హానాలు అందుబాటులో లేకపోవడంతో ఆ సమయంలో బహుమతుల అందుకోలేకపోయారు. ఈ శనివారం జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు వారికి ఆహ్వానం.డైమండ్ జూబ్లీ వేడుకలపై సమీక్ష: అనంతరం డైమండ్ జూబ్లీ వేడుకల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ కమిటీల పనితీరు, ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలు, ప్రోగ్రెస్‌పై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి కమిటీ సమన్వయంతో పనిచేయాలని పూర్వ విద్యార్థులు సూచించారు.అలాగే తదుపరి సమావేశాన్ని అక్టోబర్ నెల రెండో ఆదివారం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డైమండ్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం. భాస్కర్ రెడ్డి, యాదాటి రవీంద్రుడు, మాజీ సర్పంచ్ వేల్పుల జయపాల్, సైంటిస్ట్ పవన్ కుమార్, అంజలి, మక్బుల్ భాష, ఆరిఫ్ జహాన్, జె.ఎం.డి. రఫీ, జె. ఇంతియాజ్, జె. సుల్తాన్, జయరామిరెడ్డి, జుల్‌ఫకర్, నస్రుల్లా ఖాన్, నారాయణ, శ్రీరాములు, చంద్రశేఖర్ రెడ్డి, అతావుల్లా, శంషుద్దీన్, ముస్తాక్ అహ్మద్, సాబీర్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ లో 805 కేసులు పరిష్కారం:జడ్జి శోభరాణి



**నందికొట్కూరు సెప్టెంబర్ 12( నంది పత్రిక)** స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ను రెండు బెంచులలో కార్యక్రమాన్ని నిర్వహించగా జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు యొక్క కేసులు మొత్తం 805 కేసులను పరిష్కరించామని సీనియర్ సివిల్ జడ్జి ఏ శోభారాణి మరియు జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య లు తెలిపారు. ఇందులో ఎస్ టి ఎసి కేసులు 734, క్రిమినల్ కేసులు 19, ఎన్ ఐ యాక్ట్ కేసులు 2, ఎక్సైజ్ కేసులు 42, సివిల్ మరియు ఆస్తి తగాదాలు 3, ఈ పి లు 4 వెరసి మొత్తం 805 కేసులను పరిష్కరించినట్లు జడ్జీలు తెలిపారు. ఈ జాతీయా లోక్ అదాలత్ కు సహకరించిన బార్ అసోసియేషన్ న్యాయవాదులకు, లోక్ అదాలత్ బెంచ్ నామినేటెడ్ మెంబర్స్ కు, పోలీస్ అధికారులకు, పత్రికా విలేకరులకు మరియు కక్షిదారులకు అభినందనలు తెలియజేశారు.

## విశాలాంధ్ర విలేకరి నాగరాజు పై దాడి చేసిన పత్తికొండ సీఐని సస్పెండ్ చేయాలి

**సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి. కృష్ణ**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** విశాలాంధ్ర విలేకరి నాగరాజు పై దాడి చేసి, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన విలేకరితో దురుసుగా, రౌడీలా ప్రవర్తించిన పత్తికొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి. కృష్ణ డిమాండ్ చేశారు. విలేకరిపై దాడి జరగడమే కాకుండా, తనపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన విలేకరితో సీఐ దురుసుగా ప్రవర్తించడం, బెదిరింపు ధోరణిలో మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయం అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే విలేకరులపై దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే వారిపట్ల అనుచితంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు.గతంలో విద్యార్థి సంఘ నాయకులపై అక్రమ కేసులు బనాయించారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఇప్పుడు విశాలాంధ్ర విలేకరిపై దాడి ఘటన వెలుగులోకి రావడం ఆందోళనకరమన్నారు. అధికారాన్ని చూసుకుని విర్రవీగడం సరికాదని, అధికారం శాశ్వతం కాదని హెచ్చరించారు.పోలీసు అధికారులు ప్రజల కోసం పనిచేయాలి కానీ రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రజాస్వామ్య విలువలను, మీడియా స్వేచ్ఛను అణచివేయడం తగదన్నారు. విశాలాంధ్ర విలేకరిపై జరిగిన దాడిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పత్తికొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని లేనియెడల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని సిపిఐ టి. కృష్ణ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన ఈడీ ప్రయాణికుల సమస్యలపై ఆర్టీసీ సిబ్బందిని అడిగి తెలుసుకున్న ఆర్.ఆర్.కె. కిషోర్







**వెలుగోడు, సెప్టెంబర్ 12 (నంది పత్రిక):**వెలుగోడు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఆర్.ఆర్.కె. కిషోర్ అన్నారు. శనివారం ఆయన వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా బస్టాండ్‌లోని ప్రయాణికుల ప్రాంగణం, ప్లాట్‌ఫామ్ పరిస్థితి, గుంతలు పడిన ప్రదేశాలు, పనిచేయని మరుగుదొడ్లు ఇతర ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణికులకు ప్రస్తుతం అందుతున్న సౌకర్యాలు, బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై ఆర్టీసీ సిబ్బందినీ అడిగి వివరాలను తెలుసుకున్నారు. బస్టాండ్ అభివృద్ధికి అవసరమైన చర్యలపై సిబ్బందితో చర్చించారు.బస్టాండ్ దుస్థితిపై వినతిపత్రం అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్బర్ సా, రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు చాంద్ భాషా కలిసి వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించి ప్రయాణికుల ఇబ్బందులను వివరించారు.వెలుగోడు బస్టాండ్‌కు ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, అయితే బస్టాండ్‌లో సరైన వసతులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బస్టాండ్‌లో సిమెంట్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయడం , ప్రయాణికులు వర్షాలకు ఇబ్బంది పడకుండా,షెడ్లు నిర్మించాలని .అదేవిధంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి సౌకర్యం కల్పించడం , చాలా వరకు పనిచేయని మహిళల మరుగుదొడ్లను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. బస్టాండ్‌లో ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రయాణికులు, బస్సులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకుసానుకూలంగా స్పందించిన ఈడీ నాయకులు అందజేసిన వినతిపత్రంలోని అంశాలను ఈడీ ఆర్.ఆర్.కె. కిషోర్ పరిశీలించి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు సంబంధించిన సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వెలుగోడు బస్టాండ్ అభివృద్ధిపై స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా బేగం, ఆత్మకూరు డిపో ఇన్‌చార్జి డిపో మేనేజర్ రఫీక్, ఆర్టీసీ అసిస్టెంట్ ఇంజనీర్ బాబు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీహెచ్ఎస్ బాచేపల్లెలో ఘనంగా హిందీ దినోత్సవం

**విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి**



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 12 నంది పత్రిక:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల బాచేపల్లెలో హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. మస్తాన్ ఆధ్వర్యంలో, హిందీ ఉపాధ్యాయులు షేక్ హుసేన్ బాషా నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి జెడ్పీహెచ్ఎస్ ఆర్.కృష్ణాపురం ప్రధానోపాధ్యాయులు సుధాకర్ , హిందీ ఉపాధ్యాయులు జీలాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతపై ప్రసంగాలు, కవితలు, పాటలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భాషా నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు మస్తాన్ పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయులు హుసేన్ బాషా సర్ కృతజ్ఞతలు తెలిపారు.



# కూటమి అక్రమాలకు పులివెందుల,ఒంటిమిట్ట ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనం.

**నా మున్సిపల్ ఎన్నిక వై.ఎస్. జగన్ బిక్ష అన్న జె.సి. ప్రభాకర్ రెడ్డి మాటలు గుర్తు లేదా?**

**గ్రూప్-1,డిఎస్సీల పై వై.ఎస్ జగన్ సిబీఐ విచారణ కోరితే పారిపోయిన మీరా మాట్లాడేది?**

**ఉత్తర కుమార ప్రగర్బాలు మాని లోకేష్ పాదయాత్రను గుర్తెరిగి ప్రవర్తించండి .**

**చింతామణి శ్రీరంగ నీతులు కట్టిపెట్టండి... ఆర్. శ్రీనివాసులరెడ్డి, చింతమనేని లపై రెడ్యం ఫైర్.**

**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 12** కూటమి ప్రభుత్వంలో,నారా చంద్రబాబునాయుడు సర్కార్ లో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన పులివెందుల,ఒంటి మిట్ట జడ్పిటీసి ఎన్నికల్లో టీడీపీ కి చెందిన మీరు ఎంతకు బరితెగించి గెలుపొందారో తెలిసి యావత్ రాష్ట్రం విస్తుపోయిందని... ఎన్నికలను కూడా ఇలా చేస్తారా? అని ప్రజాస్వామ్యం సిగ్గుతో తలవంచుకుందని దీనిని మరచి సిగ్గులేకుండా వైసిపి అధికారం లో ఉండగా అధికారం,పోలీసులను అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా ఎకగ్రీవాలు చేసుకున్నదని టిడిపి జోనల్ కో- ఆర్డినేటర్ రెడ్డెప్ప గారి శ్రీనివాసులరెడ్డి మాట్లాడటం చింతామణి శ్రీరంగ నీతులను గుర్తుకు తెస్తోందని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు.కడప నగరంలో వైస్సార్ జిల్లా కార్యాలయం లో శనివారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కంటే టీడీపీ కి కేవలం రెండు సీట్లు మాత్రమే ఎక్కువగా వచ్చాయని ఆరోజు ముఖ్యమంత్రి గా వై.ఎస్. జగన్ అనుకుని ఉంటే ఎన్నికల్లో నేను మున్సిపల్ చైర్మన్ అయ్యే వాడినే కాదని, తాను చైర్మన్ అయ్యానంటె అది వై.ఎస్ జగన్ పెట్టిన బిక్ష అని తాడిపత్రి మున్సిపల్ చైర్మెన్ గా గెలిచిన జె.సి. ప్రభాకర్ రెడ్డి అన్న మాటలు మీకు గుర్తుకు రాలేదా? అని ఆయన నిలదీశారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుటి మా వైసిపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ని అరెస్ట్ చేయించి ప్రజాస్వామ్య క్షేత్రంలో న్యాయాన్ని గెలిపించి ప్రజా స్వామ్యాన్ని కాపాడానని నాడు వై.ఎస్.జగన్ అన్న మాటలను రెడ్యం గుర్తు చేశారు. వీటన్నింటిని మరచి,నీ స్థాయిని సైతం మరచి ఓటమి భయంతో వై.ఎస్. జగన్ పూటకో మాట మాట్లాడుతున్నారని ఆర్ శ్రీనివాసులరెడ్డి అసందర్భ ప్రేలాపనలు చేయడం "మొగున్ని కొట్టి మొగసాల" ఎక్కినట్లుందని" ఆయన ఎద్దేవా చేశారు. 2018లో గ్రూపు-1 నోటిపికేషన్ లో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,విద్యా మంత్రి లోకేష్ నాయుడు తీవ్ర ఆరోపణలు చేశారని... డిఎస్సీ 2025 లో తీవ్రమైన అక్రమాలు జరిగాయని వై.ఎస్.జగన్ స్వయంగా ఆరోపించారన్నారు. ఈ రెండింటి పై దమ్ము,ధైర్యం ఉంటె సిబీఐ విచారణకు మీరు సిద్ధమా అని వై.ఎస్.జగన్ అంటే పారిపోయిన చంద్రబాబు,లోకేష్ లు డిఎస్సీ లో అక్రమాలే జరగలేదని నిసిగ్గుగా అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని ఆయన తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. వాస్తవాలు నగ్నంగా కన్పిస్తుంటె గ్రూప్ -1 లో అక్రమాలు జరిగాయనడం.వై.ఎస్.జగన్ పై బురద చల్లడం టి.డి.పి నేతల నీచ రాజకీయానికి పరాకాష్ట అని ఆయన మండి పడ్డారు. 2027లో వై.ఎస్.జగన్ పాదయాత్ర ఎలా చేస్తారో చూస్తానంటున్న వీధి రౌడీ, ఆకు రౌడీ దెందులూరు టి.డి.పి.శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ ఉత్తరకుమార ప్రగల్బాలు మాని వైఎస్సార్ ప్రభుత్వంలో వై.ఎస్.జగన్ అనుకుని ఉంటే నారా లోకేష్ పాదయాత్ర చేసేవారా?అని ప్రశ్నిస్తూ దమ్ముంటే దీనికి సమాధానం చెప్పాలని చింతమనేని ప్రభాకర్ కు రెడ్యం సవాల్ విసిరారు. వై.ఎస్.జగన్ పాదయాత్రను ఆపడం నీ తరం కాదు. నీ అబ్బ తరం కాదు,మీ కూటమి నేతలంతా ఏకమైనా ఏమీ కాదన్న సత్యాన్ని గ్రహించి మసలు కోకపోతే ప్రజా గ్రహాన్ని రుచి చూడక తప్పదని రెడ్యం తీవ్రంగా హెచ్చరించారు.




## ఆళ్లగడ్డ నియోజకవర్గం లో 52 చెరువులకు తెలుగు గంగ నీరు...

**తెలుగు గంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీకృష్ణ.**

**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 12 (నంది పత్రిక):** ఆళ్లగడ్డ నియోజకవర్గం లో 68 చెరువుల ఉండగా ఇప్పటికే 52 చెరువులకు త్రాగునీటి అవసరాల కోసం తెలుగంగ నీటిని నింపడం జరిగిందని ఆళ్లగడ్డ తెలుగు గంగ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన రుద్రవరం మండలంలోని తెలుగంగ ప్రధాన కాలువ 17, 18 ,19 ,20 ఉప కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 25 ఉప కాలువ వరకు నీరు పారుతుందన్నారు. రెండు రోజుల్లో 29 ఉప కాల్వ వరకు నీరు పారే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. 22 ఉపకాలవ పరిధిలో ఉన్న చెరువులకు పూర్తిగా నీరు నింపడం వల్ల ఉపకాల్వ గేటు మూసి వేయడం జరిగిందన్నారు. అలాగే రుద్రవరం మండలంలోని అన్ని చెరువులకు నీరు సమృద్ధిగా నింపడం జరుగుతుందన్నారు. అలాగే రైతులు త్రాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి అన్నారు. తెలుగంగ ప్రధాన కాలువ వెంట నీరు వృధా కాకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. రైతులు కాలువలకు గండ్లు కొట్టకుండా రాత్రి సమయాలలో తెలుగు గంగ కాల్వ వెంట పోలీసులు, తెలుగు గంగ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ఒక చుక్క నీరు కూడా వృధా కాకుండా ప్రతిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. రుద్రవరం సమీపంలోని 17, 18 ఉపకాల్వలకు రైతుల విన్నపం మేరకు వాటి కింద ఉన్న చెరువులకు నీరు వదలడం జరిగిందన్నారు. రైతులు తెలుగంగ నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకొని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.



## మట్టి గణేశ విగ్రహాలనే వినియోగించాలి

**13న ఉచితంగా 3 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 12(నంది పత్రిక):-** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం (13-09-2026) ఉచితంగా 3,000 మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనం సమీపంలోని రెవెన్యూ క్లినిక్ వద్ద ఆదివారం ఉదయం 9.00 గంటల నుంచి 10.30 గంటల వరకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి చేతుల మీదుగా ఉచిత మట్టి గణేశ విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించకుండా, పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని సహజ మట్టితో తయారు చేసిన గణేశ విగ్రహాలను ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగం ద్వారా జలవనరులు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. "మట్టి వినాయకుడు – పర్యావరణానికి మేలు" అనే సందేశంతో పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజలు, భక్తులతో పాటు జిల్లా అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా పంపిణీ చేసే మట్టి గణేశ విగ్రహాలను స్వీకరించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.



## భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను విమర్శిస్తే సహించలేదు : మాల మహానాడు.

**హమార ప్రసాద్ చిత్రపటాని చెప్పులతో కొట్టిన మాల మహానాడు నాయకులు.**

**నందికొట్కూరు సెప్టెంబర్ 12( నంది పత్రిక)** హమారా ప్రసాద్ అని ఒక పోరంబోకు వెధవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కల్పిత నాయకుడు అంబేద్కర్ అంటూ పుస్తకాన్ని ముద్రించి రిలీజ్ చేయడం అంటే అవమానించడమేనని అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాముడు, పివి రావు మాల మహానాడు గౌరవ సలహాదారులు లాయర్ విజయ్ కుమార్, అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో హమార ప్రసాద్ మతోన్మాది భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై రచించిన కల్పిత నాయకుడని పుస్తకాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హమార ప్రసాద్ ఒక పోరంబోకు వెధవ అంటూ అతని చిత్రపటానికి వారు చెప్పులతో కొట్టారు. మతోన్మాదంతో అన్ని వర్గాల ఆరాధ్యుడు, దేశ ప్రజలకు హక్కులు స్వేచ్ఛ స్వాతంత్రం కల్పించిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కల్పిత పాత్రలతో పుస్తకాన్ని రచించడం హేయమైన చర్యగా వారు పేర్కొన్నారు. మహనీయులు అంబేద్కర్ పై తప్పుడు ప్రచారం చేస్తూ మతోన్మాద బుద్ధులు చూపిస్తే బడుగు బలహీన వర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. మతోన్మాది హమారా ప్రసాద్ పై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రంగస్వామి, రంగన్న, విజయ్ కుమార్, వనముల నాగన్న, బండారు శ్రీనివాసులు, చేరుకు నడిపేన్న, స్మశాన కార్మికులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి నాగరాజు పాల్గొన్నారు.




## ఏలిని నో వల్ల రాష్ట్రానికి పెద్ద విపత్తు దీన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలి : సిపిఐ

**ప్రభుత్వం ,స్వచ్ఛంద సంస్థలు కలసి ప్రజలను రైతుల ను ఆదుకోవాలి**

**ప్రభుత్వం అన్ని రకాల రైతుల బ్యాంకు అప్పులను మాఫీ చేయాలి**

**డోన్ నంది పత్రిక సెప్టెంబర్: 12** డోన్ పట్టణం లోస్థానిక సిపిఐ కార్యాలయంలోనేడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూరాష్ట్రానికి పెద్ద విపత్తు సంభవించింది దీనిని జాతీయ విపత్తుగా పరిగణించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఎలిని నో ప్రభావం వల్ల రాష్ట్రానికి పెద్ద విపత్తు సంభవించిందని అది జాతీయ విపత్తుగా పరిగణించాలని అన్నారు. ఏలినీ నో ప్రభావం వలన ఖరీఫ్ క్రాఫ్ ల కు క్రాప్ హాలిడే అయినవని విత్తనం వేసేకి పైరు కాలేదని ఎండిపోతున్నాయి. వర్షాలు వచ్చే సూచనలు కూడా లేవనీ క్రాఫ్ హాలిడే గా అయినవని, హంద్రీనీవా కాలువ పక్కన ఉన్న కొద్దిపాటి భూములు తప్ప మిగిలినవిఎండిపోతున్నాయని అన్నారు. కావున ఇంత పెద్ద విపత్తు వచ్చినప్పుడు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలసి ప్రజలను, రైతులను, ఆదుకొన దనికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా రైతులను ఆదుకునే టందుకు అన్ని రకాల బ్యాంకు అప్పులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పనులు ఎక్కువ రోజులు పెంచాలని అన్నారు. కరోనా సమయంలో రేషన్ బియ్యం డబుల్ కోట ఇచ్చేవారని అలాగే ఇప్పుడు కూడా డబల్ కోట రేషన్ బియ్యం ఇవ్వాలని అన్నారు. విపత్తులో ప్రభుత్వం ద్వారా పశుగ్రాసం సప్లై చేయమని పశుసంపదను ఆదుకోవాలంటే ప్రభుత్వాన్ని కోరుతున్నా ఇతర స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో ఈ విపత్తులను కాపాడడానికి ముందుకు రావాలని సిపిఐ పార్టీగా మేము కోరుతున్నామని అన్నారు. పంజాబ్ నుండి వరి గడ్డి నీ అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే వ్యాగిళ్ళ ద్వారా తెప్పించి సప్లై చేసేవారు, ఇప్పుడు కూడా గడ్డి కేంద్రాలు పెట్టి పశు గ్రాసం సప్లై చేయాలని ఆయన అన్నారు. వరదలు వస్తే ప్రజలను ఏ విధంగా ఆదుకుంటారో ప్రస్తుతం రైతులను , సన్నకారు రైతులను ఆదుకోవాలని నిన్న కలెక్టర్ సమావేశం నిర్వహించారు చంద్రబాబు నాయుడు ఎక్కడ కూడా రైతులను ఆదుకోవాలని కరువు పైన మాట్లాడకపోవడం చాలా బాధాకర విషయం ఈరోజు రాష్ట్రమంతా అతని వర్షాలు లేక వేసిన పంటలు పెట్టిన పెట్టుబడి తిరిగి రాక గ్రామీణ ప్రాంతంలో పనులు లేక పశువులకు మేత లేక మూగజీవాలు మేతలేక కసాయి వాళ్లకు అమ్మేసుకుంటున్నారు. ఒక్కపక్క ఎలీనినో ప్రభావంతో ఒకపక్క అయితే మరోపక్క విపరీతమైన నిత్యవసరం ధరలు ఆకాశాన్ని అంటుతున్న వాటిపై మాట్లాడకపోవడం చాలా బాధాకర విషయం ప్రభుత్వం వేల ఎకరాలు సోలార్ కి కట్టబెడతా ఉన్నారు.ఇప్పటికే కరెంటు కోత విధిస్తున్నారు వాటిని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని రైతులను కార్మికులను సకలజనులను కాపాడాలని శ్రీశైలం లో బ్యాగ్ వాటర్ త్రాగడానికి చాలా ఇబ్బంది ఉన్నది. ఇలాంటి తరుణంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ తన సొంత జిల్లాకు చిత్తూరు నగరి కి తీసుకుపోవడం చాలా దుర్మార్గమైన చర్య అని వారు వ్యక్తం చేశారు. 14న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పర్యటన విజయవంతం చేయాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ మండల కార్యదర్శి నారాయణ పట్టణ కార్యదర్శి మోటా రాముడు చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి రామ్మోహన్ ప్యాపిలి మండల కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## 93 కేసుల నిందితుడు అరెస్ట్ సాంకేతికతతో పట్టివేత--




**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 12(నంది పత్రిక):-** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 93 కేసులు నమోదైన అంతరాష్ట్ర దొంగను నంద్యాల మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం వెస్ట్ కోడిపల్లికి చెందిన తిమ్మసముద్రం శివ అలియాస్ నందు అలియాస్ వంశీ (38)ను నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మహానంది కాలనీ రైల్వే క్వార్టర్స్‌లో ఆగస్టు 20న తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ అనంతరం గుంటూరు వెళ్లిన నిందితుడు, తాను వదిలివెళ్లిన స్కూటీని తీసుకెళ్లేందుకు నంద్యాలకు తిరిగి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో అతడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఐఫోన్ పదకొండు, టామీ హిల్‌ఫిగర్ చేతి గడియారం, టీవీఎస్ పెప్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.67 వేలుగా పోలీసులు తెలిపారు.విచారణలో నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 93 కేసులు ఉన్నట్లు వెల్లడైంది. నంద్యాల, కర్నూలు, ఎమ్మిగనూరు, హైదరాబాద్, రాచకొండ, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అతనిపై కేసులు నమోదైనట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు, నంద్యాల ఉపవిభాగ సహాయ పోలీసు అధికారి సుస్మిత పర్యవేక్షణలో, మూడో పట్టణ సీఐ ఏ. వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నిందితుడిని అరెస్టు చేసింది. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ, సహాయ పోలీసు అధికారి అభినందించారు.

## కడప రిమ్స్‌లో అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం..

**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 12** పేదలకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి , టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి . కడప నగరంలోని రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రభుత్వ విప్ & కడప శాసనసభ్యురాలు శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కడప జిల్లాలోని నిరుపేద ప్రజలకు అత్యవసర సమయాల్లో కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించే లక్ష్యంతో ఈ అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తక్షణ చికిత్స అందించేందుకు అవసరమైన వెంటిలేటర్లు, అత్యాధునిక వైద్య పరికరాలు ఇక్కడ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని, రిమ్స్ ఆసుపత్రిని వైద్య రంగంలో ఆదర్శవంతమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, వైద్య సిబ్బంది మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## వెంకటేశ్వర స్వామి వ్రతం హాజరైన బీసి ఇందిరారెడ్డి

**బనగానపల్లె సెప్టెంబర్ 12నందిపత్రిక** బనగానపల్లె మండలం చెరువుపల్లె గ్రామములో తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ ఇటికల శరత్ బాబు శనివారం వెంకటేశ్వర స్వామికి నిర్వహించిన వేంకటేశ్వర స్వామివారి సప్త శనివారాల వ్రత వేడుకకు మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి హాజరై వ్రతం లో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు.



## దూదేకుల ఆత్మీయ సమావేశం

**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 12 నంది పత్రిక** దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం 84/2024 నంద్యాల జిల్లా అధ్యక్షులు-ప్రధాన కార్యదర్శులు మౌలాలి -దస్తగిరిఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు సిద్దయ్య ప్రధాన కార్యదర్శి కన్నయ్య మాట్లాడుతూ దూదేకుల వర్గం చాలా వెనుకబడి ఉన్నాము ఉద్యోగులుగా మనమంతా చైతన్యం కావాలనే ఉద్దేశంతో ఈ విధమైనటువంటి సమావేశాలు ఏర్పరుస్తున్నామని తెలిపారు కోవెలకుంట్ల పట్టణ అధ్యక్షులుగా గాంధీ బాబు ప్రధాన కార్యదర్శిగా నాగబాబు, ట్రెజరర్ గా డిసి. హుస్సేన్, ఉపాధ్యక్షులుగా భాస్కర్ బాబు, కార్యదర్శిగా మహమ్మద్ హుస్సేన్, పట్టణ గౌరవ అధ్యక్షులుగా హుస్సేన్, అదనపు కార్యదర్శిగా దస్తగిరి, ఉపాధ్యక్షులుగా నాసర్ వలిని ఎన్నుకున్నారు కార్యక్రమంలో , హుసేని, హసన్ పాల్గొన్నారు



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# చక్రం తిప్పుతున్న లిక్కర్ డాన్లు..

## ఆగని దందా.!వినాయక చవితి పండుగే టార్గెట్..







**అధిక ధరలతో సామాన్యులపై భారం నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు..**
**ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలని డిమాండ్**

**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 12 (నంది పత్రిక )**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో మద్యం విక్రయాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కొందరు మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పండుగల సమయంలో మద్యం విక్రయాలను టార్గెట్‌గా చేసుకుని అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తున్నాయి.

**క్వార్టర్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనపు వసూళ్లు?**

క్వార్టర్ బాటిల్‌పై నిర్ణీత ఎంఆర్‌పీ కంటే రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న మొత్తమే కదా అని భావించినా, రోజువారీ కూలీలు, పేదలు, సామాన్య కుటుంబాలకు అదే మొత్తం అదనపు భారంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పండుగల సమయంలో మద్యం కొనుగోలు పెరుగుతుందనే ఉద్దేశంతో ధరలు మరింత పెంచుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలపై మద్యం ధరల భారం కూడా పడుతోందని పలువురు అంటున్నారు.

**ఎంఆర్‌పీ బోర్డులు.. బిల్లుల జారీపై తనిఖీలు చేయాలి**

ఎంఆర్‌పీ కంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.మద్యం దుకాణాల్లో ధరల వివరాలు స్పష్టంగా ప్రదర్శిస్తున్నారా? బిల్లులు ఇస్తున్నారా? నిర్ణీత ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా?** మద్యం విక్రయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. దుకాణాల నిర్వహణ, విక్రయ సమయాలు, ధరల ప్రదర్శన, బిల్లుల జారీ, అనుమతులు, నిల్వలు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**పేదలపై పడుతున్న అదనపు భారం** అధిక ధరలకు మద్యం విక్రయించడం వల్ల కేవలం వినియోగదారుడికే నష్టం కాకుండా, కుటుంబాలపై కూడా ఆర్థిక భారం పడే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోజువారీ కూలీ చేసుకుని కుటుంబాన్ని పోషించే వ్యక్తి మద్యం కోసం అదనపు ధర చెల్లించాల్సి వస్తే, ఆ ప్రభావం చివరకు కుటుంబ ఖర్చులపై పడుతుందని ప్రజలు చెబుతున్నారు. రూ.10, రూ.20 అదనంగా చెల్లించాల్సి వచ్చినా నెల మొత్తానికి అది పెద్ద భారంగా మారుతుందని అంటున్నారు.

**వినాయక చవితి పండుగే టార్గెటా?** వినాయక చవితి పండుగ నేపథ్యంలో మద్యం విక్రయాలు పెరిగే అవకాశం ఉన్నందున, ఇదే అదనపు వసూళ్లకు అవకాశంగా మారకూడదని ప్రజలు కోరుతున్నారు.పండుగ పేరుతో సామాన్య వినియోగదారులను దోచుకునే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, పండుగ రోజుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులపై కూడా ఆరోపణలు.. విచారణకు డిమాండ్**

మరోవైపు, కొందరు అధికారులు మరియు మీడియా వ్యక్తుల సహకారం ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో నిరాధార ఆరోపణలు అయితే వాటిని కూడా అధికారులు స్పష్టంగా కొట్టిపారేయాలని కోరుతున్నారు.

**ప్రక్క మండలాలకు విస్తరించక ముందే కట్టడి చేయాలి**

పోరుమామిళ్లకే పరిమితం కాకుండా ప్రక్క మండలాలకు, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు ఇలాంటి అక్రమ పద్ధతులు విస్తరించే అవకాశం లేకుండా ముందుగానే అధికారులు అప్రమత్తం కావాలని ప్రజలు కోరుతున్నారు.పండుగల సమయంలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి మద్యం దుకాణాలు, అనుమానాస్పద విక్రయ కేంద్రాలపై నిఘా పెంచాలని అంటున్నారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, వాటిపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను రంగంలోకి దింపాలని, అవసరమైతే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే విధంగా ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు.

**ప్రభుత్వానికి చెడ్డపేరు రాకముందే చర్యలు**

మద్యం ధరల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలకు, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పాలనకు చెడ్డపేరు రాకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆదాయం పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపే పరిస్థితి ఎక్కడా ఉండకూడదని కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అంటున్నారు.

**మంత్రి లోకేష్.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలి**

మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి, మద్యం విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేకంగా వినాయక చవితి పండుగ నేపథ్యంలో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల తనిఖీల కోసం ఎదురుచూపులు**

నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత దుకాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.అక్రమ మద్యం విక్రయాలు, అధిక ధర వసూళ్లు, నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

**ధర్నాలు, రాస్తారోకోలకు దారితీయక ముందే..**

ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఈ వ్యవహారం మరింత పెద్ద వివాదంగా మారే అవకాశం ఉందని, ప్రజలు ఆందోళనలకు దిగే పరిస్థితి రాకముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.మద్యం విక్రయాల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారెవరైనా, వారికి సహకరిస్తున్న వారెవరైనా విచారణలో తేలితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు, నిబంధనల ఉల్లంఘన, అక్రమ సిండికేట్ల ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర తనిఖీలు నిర్వహిస్తారా? లేక ఫిర్యాదులు కాగితాలకే పరిమితం అవుతాయా? అనేది వేచి చూడాల్సి ఉంది. అధికారులు.. మద్యం వ్యాపారులూ.. నిబంధనలు పాటించండి. ప్రజలను దోచుకునే పరిస్థితులకు తావివ్వకండి.!

## కర్నూలులో ఘనంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**కర్నూలు సిటీ నంది పత్రిక** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఆశీస్సులతో నగరంలోని జిల్లా గోరక్షణ మహా సంఘం ఆవరణలో వేముల రమేష్ బాబు దంపతులు ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అదేవిధంగా పాత బస్టాండులో వాసవీ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో శేషఫణి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. సుమారు 3 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయడం సులభంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గోరక్షణ మహా సంఘం అధ్యక్షురాలు ఇల్లూరు రాజలక్ష్మి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, ఏపీఐబీసీ డైరెక్టర్, గాయత్రి గోసేవ సమితి అధ్యక్షుడు జగదీష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగం



**కర్నూలు సిటీ నంది పత్రిక** వర్షాలు సమృద్ధిగా కురవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ సూచన మేరకు నగరంలోని జిల్లా గోరక్షణ మహా సంఘం ఆవరణలో గాయత్రి గో సేవా సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యాగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మంత్రి టీజీ భరత్ సూచన మేరకు వరుణ యాగం నిర్వహించినట్లు తెలిపారు. యాగం ఫలించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోరక్షణ మహా సంఘం అధ్యక్షురాలు ఇల్లూరు రాజలక్ష్మి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, ఏపీఐబీసీ డైరెక్టర్, గాయత్రి గోసేవ సమితి అధ్యక్షులు జగదీష్ గుప్తా, కార్యనిర్వాహణ అధికారి శౌరి, టీఎస్ విజయ్ కుమార్, గుండా శ్రీధర్ పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

### కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక**ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్ , కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ లు ఆదేశాలు జారీ చేశారు. వాహన దారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధిలలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

## 24 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి 2001-02 బ్యాచ్



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండలంలోని మహదేవపురం ఉన్నత పాఠశాలలో శనివారం 2001-2002 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా జరిగింది. సుమారు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నాటి మిత్రులంతా ఒకే చోట చేరి "మిత్రమా కుశలమా" అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాల నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కే. సుబ్రహ్మణ్యం, రాజులు, విజయరాజు, నరసింహ, శ్రీనివాసులు, రాబర్ట్, నాగలక్ష్మి, సరోజ, ప్రసన్న కుమారిలను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఇన్నేళ్ల తర్వాత తమ విద్యార్థులను కలవడం చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు వడ్డే చిన్నలాలు, కోటయ్య, డి. మద్దిలేటి స్వామి, దామోదర్ రెడ్డి, మృత్యుజావలి, లింగమయ్య గౌడ్, పర్వీన్, సరస్వతి, విజయలక్ష్మి, గౌరీ, కుళాయమ్మ, రాధిక, నిర్మల దేవి తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఏడాదిగా వేధింపులు.. అమెరికాలో నడిరోడ్డుపై భారత సంతతి మహిళ దారుణ హత్య

అమెరికాలో భారత సంతతికి చెందిన మహిళ దారుణ హత్యకు గురయ్యారు. కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో నివాసముంటున్న 38 ఏళ్ల పాలిని కాకుర్లను, గత ఏడాది కాలంగా వేధిస్తున్న ఓ యువకుడు నడిరోడ్డుపై కాల్చి చంపాడు. అనంతరం నిందితుడు కూడా తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘోర ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.

## ముసాయిదా బిసి రక్షణ బిల్లు 2026 పై మంత్రి సవితమ్మతో బీసీ కార్పొరేషన్ చైర్మన్లు భేటీ



**కర్నూల్ సిటీ నందిపత్రిక** బీసీ భవన్, గొల్లపూడి, విజయవాడ నందు బిసి వర్గాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కి మరింత చట్టబద్ధమైన రక్షణ కల్పించే దిశగా రూపొందిస్తున్న ముసాయిదా బీసీ రక్షణ బిల్లుపై కీలక సమావేశం జరిగినది ఈ సమావేశం నందు మంత్రి సవితమ్మ తో కలిసి బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొని బిల్లుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారుబీసీ వర్గాలకు సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాలలో మరింత ప్రయోజనం కల్పించే అంశాలపై సమావేశంలో అభిప్రాయాలను వెల్లడించారు క్షేత్రస్థాయిలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణలోకి తీసుకొని భవిష్యత్తులో వారికి మరింత భరోసా కల్పించే విధంగా ముసాయిదా బిల్లు ఉండాలని చర్చించారుమంత్రి పార్థసత్యమ్మ మాట్లాడుతూ బీసీ లకు రక్షణ చట్టాన్ని తీసుకొస్తూ బీసీలకు అండగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడుకి, ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈనెల 17వ తారీకు జరుగు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా జరపాలని కోరడమైనది అలాగే అన్ని జిల్లా కేంద్రాల్లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని అధికారికంగా జరుపుటకు జీవో ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమము నందు బీసీ మంత్రివర్యులు సవితమ్మ , బీసీ శాఖ ప్రభుత్వ అధికారులు, చైర్మన్ లతో కలిసి పాల్గొనడం జరిగినది.



## మొక్కజొన్న పంట కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన దంపతుల అరెస్ట్ .

### సుమారు రూ.2 కోట్లు బకాయి.

**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె, కాల్వ తదితర గ్రామాల్లో రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన ఘటనపై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ .నెంబర్ .25/2026 యు /ఎ 316(5) బీ/ఎ 3(5) బి ఎన్ యస్ కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బేతంచర్ల గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా, వయస్సు 42 సంవత్సరాలు, (తండ్రి పేరు జిలాని,) మరియు అతని భార్య

షేక్ రిజ్వాన భాను, వయస్సు 38 సంవత్సరాలును

12.09.2026న అరెస్ట్ చేసి,గౌరవనీయ జె ఎం యఫ్ సి , స్పెషల్ మొబైల్ కోర్ట్ , కర్నూలు వారి ఎదుట హాజరుపరచడం జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం కర్నూలు రూరల్ సర్కిల్ ఆఫీస్ లో కర్నూలు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర , కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు , ఓర్వకల్లు ఎస్సై సునీల్ తో కలిసి వెల్లడించారు.విచారణలో వెల్లడైన ముఖ్యాంశాలు:- షేక్ మహబూబ్ బాషా రైతుల నుండి సుమారు 88 లారీల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, వ్యాపారస్తులైన యనబోతుల నాగమ్మ, ఆకుల శ్రీనివాసరావులకు సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది.- ఈ లావాదేవీలకు సంబంధించి షేక్ మహబూబ్ బాషా, అతని భార్య రిజ్వాన భాను, వారి బంధువులకు చెందిన హెచ్డీఎఫ్సీ , యస్ బి ఐ , కోటక్ మహీంద్రా బ్యాంకు ఖాతాల ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించబడింది.రైతులకు సుమారు రూ.4 కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా సుమారు రూ.2 కోట్లు బకాయి ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. - ఆకుల శ్రీనివాసరావు బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.5 కోట్లకు పైగా షేక్ మహబూబ్ బాషా, రిజ్వాన భాను బ్యాంకు ఖాతాల్లోకి జమ అయినట్లు గుర్తించబడింది. అందులో కొంత మొత్తాన్ని రైతులకు పూర్తిగా చెల్లించకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో నిందితుల బ్యాంకు ఖాతాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎంత మేరకు మోసం జరిగింది, ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది అనే అంశాలపై సమగ్రంగా విచారణ చేపట్టి, దర్యాప్తు ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని కర్నూల్ డిఎస్పి తెలిపారు.



# గణేష్ నిమజ్జనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన డి.ఎస్.పి శ్రీనివాసరావు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 12 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని పడకండ్ల సమీపంలోని వకులా నది పరివాహక ప్రాంతాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. త్వరలో జరగనున్న గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా వకుళనది వద్ద చేపట్టవలసిన భద్రత ఏర్పాట్ల గురించి టౌన్ సీఐ నాగరాజరావు, ఎస్సై చిన్న పీరయ్య లతో కలిసి సమీక్షించారు. వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాది నదిలో చుక్క నీరు లేక పోవడం వల్ల ఈ ఏడాది నిమజ్జనం గురించి అందరూ ఆందోళన చెందుతున్నారు

# నంద్యాలలో పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ వినాయకుడు



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 12 . (నంది పత్రిక ):** నంద్యాల శ్రీమతి కశెట్టి సుబ్బమ్మ మరియు బాలాజీ మర్చంట్స్ కమిటీ కళ్యాణ మండప దేవస్థానం నందు శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవములు 40వ వార్షికోత్సవములు పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ నిమిత్తం నంద్యాల పట్టణంలో మొట్టమొదటిసారిగా గత 13 సంవత్సరాల నుండి మట్టితో తయారు చేసినటువంటి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు కశెట్టి కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంగుటూరు గ్రామస్తులు కుమ్మరి మద్దిలేటి వాళ్ళ శిష్య బృందం చేత మూడు నెలల పాటు ఇక్కడ తయారుచేసి ఏర్పాటు చేశామన్నారు. ఈ సంవత్సరం ప్రత్యేకతగా మత్స్య కూర్మ వరాహ నరసింహ విశ్వ సంరక్షక మహాగణపతిగా స్వామి వారిని ఏర్పాటు చేయడమైనది .ఆలయ అర్చకులు అర్చకత్వంలో 14వ తేదీ సోమవారం నుండి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.16వ తేదీ బుధవారము విశ్వ సంరక్షక మహాగణపతి హోమము నిర్వహిస్తూ వస్తున్నాం భక్తాదులు ఈ హోమంలో పాల్గొనవలసిందిగా కోరుచున్నాము.40 సంవత్సరాల వినాయక ఉత్సవాల సందర్భంగా మొట్టమొదటిసారిగా చేతి లడ్డూను 18వ తేదీ నిమజ్జనం రోజు శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం నందు లడ్డు వేలం వేయబడును కావున భక్తాదులు ఈ లడ్డువేలంలో పాల్గొని స్వామివారి లడ్డూను స్వీకరించవలసిందిగా కమిటీ సభ్యులు కశెట్టి కృష్ణమూర్తి దేవస్థాన అధ్యక్షులు నారాయణ శ్రీనివాస కుమార్ ప్రధాన కార్యదర్శి దుద్దేల సురేష్ బాబు కోశాధికారి కోరారు.ఈ కార్యక్రమంలో లగిసెట్టి నవీన్ కుమార్ లగ్గిశెట్టి ఋషి కుమార్ నల్లగట్ల నరసింహారావు బొగ్గరపు వంశీకృష్ణ కొప్పర్ల శ్రీనివాస్, రవితేజ, పాలూరి వెంకటనారాయణ,అడ్డగాళ్ళ చంద్రశేఖర్, సునీల్,,పసుపుల శివ సాయి తదితరులు పాల్గొన్నారు.వినాయక చవితి నిర్వాహకుల కశెట్టి చంద్రశేఖర్ బిజెపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవస్థానం ఉపాధ్యక్షులు సహకరించిన వారు నారాయణ ధీరజ్ బొగ్గారపు అభి గత 25 సంవత్సరాల నుండి 1500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ వస్తున్నాం.పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ నిమిత్తం మా వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నామన్నారు.

## మద్యం షాపుల లైసెన్స్ రెన్యువల్



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 12** డోన్ పట్టణం మద్యం షాపుల లైసెన్సులు రెన్యువల్ మద్యం వ్యాపారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఊరట నిచ్చింది. మద్యం షాపుల లైసెన్స్ పై ఎక్స్చేంజ్ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు డోన్ ఎక్సైజ్ సీఐ జాపరూల్లా, ఎస్సై దౌలత్ ఖాన్ తెలిపారు. పాత మద్యం వ్యాపారులు షాపులు కొనసాగించాలంటే సమారు రూ 71 లక్షలు లైసెన్స్ ఫీజు తో పాటు అదనంగా 38% ఉంటుందన్నారు. పాత వ్యాపారుల్లో రెన్యువల్ నిబంధనలు ఈనెల 21గడువు ఉంటుందని కొత్తవారికి 22న రీ నోటిఫికేషను ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యవసాయం ప్రాధాన్యతాంశంగా కనబడడం లేదు....

## విజయ జ్యోతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు.



వైయస్సార్ కడప జిల్లాలో 40 మండలాల్లో 5-9-2026 నాటికి... జిల్లాలో ఎల్ నీనొ ప్రభావంతో వర్షపాతం 50 శాతం లోపు నమోదైనవి 27 మండలాలు, 50 శాతం పైన లోటులో ఉన్నవి 13 మండలాలు, అయినప్పటికీ ఇటీవల అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల కలెక్టర్ల సమావేశంలో వ్యవసాయంపై చర్చ జరగలేదని చెప్పారు.అటు పార్లమెంట్ ఉభయ సభలలో గాని, రాష్ట్రాల చట్ట సభలలో కానీ వ్యవసాయంపై సమగ్రంగా చర్చ జరగడం లేదన్నారు. సాధారణంగా చట్టసభల వర్షాకాల సమావేశాలలో తప్పనిసరిగా వ్యవసాయంపై ప్రభుత్వాలు తామంతట తామే చర్చకు అనుమతించే సాంప్రదాయం చాలాకాలం కొనసాగింది అన్నారు. అలాగే కరువు పరిస్థితి ఏర్పడినప్పుడు ఉభయ సభలలో ఆరోజు జరగాల్సిన బిజినెస్ మొత్తాన్ని వాయిదా వేసి రోజంతా కరువు పరిస్థితులపై చర్చించి సభ్యుల సలహాలు సూచనలను స్వీకరించి చివరిగా ప్రభుత్వం ఓ విధాన ప్రకటన విడుదల చేసే సాంప్రదాయం కూడా చాలా కాలం ఉండిందన్నారు. జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా ఉండగా... వ్యవసాయంపై విలువైన సూచనలు అందించే ప్రొఫెసర్ ఎన్.జి. రంగా లోక్ సభ కు ఎన్నిక కావాలని ఉద్దేశంతో ఆయనపై పోటీ చేసిన అభ్యర్థిని బ్రతిమలాడి పోటీ నుంచి విరమింప చేసిన సంఘటన వ్యవసాయం పట్ల నెహ్రూకు ఉన్న చిత్తశుద్ధిని ఎత్తిచూపుతోందన్నారు. కానీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాలకు వ్యవసాయం ప్రాధాన్యతాంశంగా కనపడటం లేదన్నారు. ప్రస్తుతం పాలకుల దృష్టి పారిశ్రామిక అభివృద్ధి, విదేశీ పెట్టుబడి ఆకర్షణ, కార్పొరేట్ రుణాల మాఫీ, విదేశీ వాణిజ్య ఒప్పందాలు మొదలైన అంశాలపై ఉందన్నారు, వీటన్నింటి మధ్య ఎల్ నినోపై జరగాల్సినంత చర్చ జరగడం లేదన్నారు. రెండేళ్ల పాటు ఎల్ నినో చూపే దుష్ఫలితాల కారణంగా వ్యవసాయ రంగం దెబ్బతింటే పర్యవసానంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతాయని, ద్రవ్యోల్బణం అదుపుతప్పుతుందని, అప్పుడు రైతాంగం పరిస్థితి దుర్భరంగా ఉంటుందని సామాన్యుల కొనుగోలు శక్తి క్షీణిస్తుందని, కాబట్టి ప్రభుత్వాలు ఇప్పటికైనా మేలుకొని పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రోరోగ్ చేయలేదు కాబట్టి పార్లమెంట్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎల్ నినో పై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ తరపున విజయ జ్యోతి డిమాండ్ చేశారు.

## అడవిలో నీరు లేక గ్రామాలలోకి వస్తున్న మూగజీవులు

**నంది పత్రిక ఆత్మకూరు..** నంద్యాల( జిల్లా )ఆత్మకూరు (మం) ముష్టపల్లె గ్రామం పరిసర ప్రాంతంలో చుక్కల దుప్పి ప్రత్యక్షం ఎల్ నీ నొ ప్రభావంతో వర్షాలు పడకపోగా అడవిలో మూగజీవాలకు నీరు లేక అడవి పరిసర ప్రాంతా మైన ముస్తపల్లె గ్రామ శివారులో చుక్కల దుప్పి రావడంతో దానిని గమనించిన కుక్కలు వెంబడించగా దుప్పిపరుగెడుతూ నీరు లేని బావిలో పడిపోవడం ముసపల్లె గ్రామానికి సంబంధించిన కొంతమంది రైతులు గమనించి ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం చేరవేగా ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి చుక్కల దుప్పిని క్షేమంగా రక్షించి మరల అడవిలో వదలడం జరిగింది ఫారెస్ట్ అధికారులు స్పందించిన తీరుపై రైతులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు



# ఆస్పిరేషనల్ జిల్లా పురోగతిలో కడపకు అగ్రస్థానం..!

## నీతిఆయోగ్ సమీక్షలో జిల్లా అభివృద్ధి పురోగతిని వివరించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**తిరుపతి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 12 నంది పత్రిక:** ఆస్పిరేషనల్ జిల్లా కార్యక్రమం కింద వైఎస్ఆర్ కడప జిల్లా అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధిస్తూ జాతీయ స్థాయిలో వరుసగా మూడు త్రైమాసికాల్లో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో.. వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ఆకాంక్ష జిల్లాలు, బ్లాకుల అభివృద్ధి పురోగతిపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతిఆయోగ్ సభ్యుడు డా. ఎం. శ్రీనివాస్ హాజరు కాగా.. నీతీ ఆయోగ్ రాష్ట్ర నోడల్ అధికారి కార్తీక్ రెడ్డి, సీపీవో హాజరతయ్యా, అనుబంధ శాఖల జిల్లా అధికారులు హాజయయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో నీతీఅయోగ్ పొందుపరిచిన ప్రమాణికాల్లో సాధించిన పురోగతిని జిల్లా కలెక్టర్ వివరించారు.ఆస్పిరేషనల్ జిల్లా కార్యక్రమంలో ఆరోగ్యంపోషకాహారం, విద్య, వ్యవసాయంనీటి వనరులు, ఆర్థిక సమ్మిళితం, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 2025లో 78.53, జూన్ 2025లో 73.60, మార్చి 2026లో 80.06 సమ్మిళిత స్కోరుతో కడప జిల్లా జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఆస్పిరేషనల్ జిల్లాగా నీతిఆయోగ్ నుంచి రే.5 కోట్ల ప్రోత్సాహక బహుమతి లభించిందని వివరించారు.ఆరోగ్య, పోషకాహార రంగంలో గర్భిణీల నమోదు, ప్రసవ సేవలు, రక్తహీనత పరీక్షలు, సంస్థాగత ప్రసవాలు, శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమాల్లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సంస్థాగత ప్రసవాలు 100 శాతంగా ఉండగా, పీహెచ్‌సీలను ఆరోగ్యసంక్షేమ కేంద్రాలుగా మార్చడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రమాణీకరణ, అత్యవసర వైద్య సేవలు వంటి అంశాల్లో 100 శాతం పురోగతి సాధించినట్లు చెప్పారు.విద్యారంగంలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయికి విద్యార్థుల మార్పిడి రేటు 98.13 శాతం, ఉన్నత ప్రాథమికం నుంచి మాధ్యమిక స్థాయికి 99.13 శాతంగా ఉందన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, బాలికల మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాల్లో కూడా దాదాపు పూర్తి స్థాయి పురోగతి సాధించినట్లు వివరించారు.వ్యవసాయ రంగంలో సూక్ష్మ సాగునీటి విస్తీర్ణం 100 శాతానికి చేరగా, పశువుల టీకాలు, కృత్రిమ గర్భధారణ కార్యక్రమాల్లో 100 శాతం పురోగతి నమోదైందన్నారు. జిల్లాలో 6,388 నీటి వనరుల పునరుద్ధరణ చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, అన్ని కాలాల్లో రహదారి సౌకర్యం, ప్రధానమంత్రి గ్రామీణ రహదారి పనులు, పౌర సేవా కేంద్రాల విషయంలోనూ 100 శాతం పురోగతి సాధించినట్లు చెప్పారు.ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమం కింద జిల్లాలోని చక్రాయపేటకమలాపురం డివిజన్ పరిధిలోని సీకే దిన్నె, జమ్మలమడుగు మండలాలను ఎంపిక చేసి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తక్కువ స్థాయిలో ఉన్న సూచికలను గుర్తించి, ప్రజలను సమీకరించడం, శాఖల సమన్వయంతో నిధులు సమకూర్చడం, ధ్రువీకరణ, లబ్ధిదారులకు అనుసంధానం, నిరంతర పర్యవేక్షణ ద్వారా సంపూర్ణ లక్ష్య సాధనకు చర్యలు చేపడుతున్నామన్నారు.జిల్లా అభివృద్ధిలో వినూత్న కార్యక్రమాలుగా స్మార్ట్ కిచెన్స్, ప్రాజెక్ట్ యాంట్స్, స్టార్టప్ కడప, ఇన్వెస్ట్ కడప వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ కిచెన్స్ ద్వారా పాఠశాలలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన వేడి భోజనం అందించడంతో పాటు సౌర విద్యుత్, విద్యుత్ వాహనాలు, జీవవాయు సాంకేతికత వంటి పర్యావరణహిత విధానాలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. యువతలో ఔత్సాహికతను పెంచేందుకు స్టార్టప్ కడప, పెట్టుబడిదారులకు భూమి నుంచి అనుమతులు, ప్రాజెక్టు అమలు వరకు సమగ్ర సహకారం అందించేందుకు ఇన్వెస్ట్ కడప వంటి వేదికలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాను అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు.

# శిథిలమైన బావిని శుభ్రపరిచి పునరుద్ధరించిన రూరల్ సీఐ రమేష్

## పూడిక, చెత్త తొలగింపు.. నీటి సదుపాయం కల్పన





**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 12** డోన్ మండలం చనుగొండ్ల గ్రామంలోని శివాలయం ముందు శిథిలావస్థకు చేరుకున్న పాత బావిని డోన్ సీఐ రాకేష్ ప్రత్యేక చొరవతో శుభ్రపరిచి పునరుద్ధరించారు. ఎన్నో రోజులుగా చెత్త, మట్టి, పూడికతో నిండిపోయి నిరుపయోగంగా ఉన్న బావిని పూర్తిగా శుభ్రం చేయించారు.బావిలో పేరుకుపోయిన పూడిక, మట్టి, చెత్తాచెదారం తొలగించి, బావి పరిసరాలను కూడా శుభ్రపరిచారు. అనంతరం బావికి అవసరమైన మరమ్మతులు చేపట్టి రూపురేఖలను మార్చారు. అంతేకాకుండా బావిలో నీరు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవడంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై మమత, పోలీసు సిబ్బంది, రవి, చనుగొండ్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.శిథిలమైన బావిని గుర్తించి శుభ్రపరిచి, పునరుద్ధరించి, నీటి సదుపాయం కల్పించిన సీఐ రకేష్‌కు చనుగొండ్ల గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సీఐ రకేష్‌కు తాము రుణపడి ఉంటామని గ్రామస్థులు పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 16న కర్నూలులో జాబ్ మేళా.. రాష్ట్ర మంత్రి టీజీ భరత్



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 16వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో మొత్తం 1,053 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. విద్యార్హతకు అనుగుణంగా వివిధ ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్న నేపథ్యంలో కర్నూలు నగరంతో పాటు జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్‌కు భరోసా కల్పించడంతో పాటు, వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరూ జాబ్ మేళాకు హాజరై తమ అర్హతకు తగిన ఉద్యోగాన్ని పొందేందుకు ప్రయత్నించాలని సూచించారు. కర్నూలు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కెరీర్‌కు మంచి బాట వేసుకోవాలని మంత్రి టీజీ భరత్ ఆకాంక్షించారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

## బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో

## ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభించిన మంత్రి





**బనగానపల్లె సెప్టెంబర్ 12నందిపత్రిక** ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు మౌలిక సదుపాయల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం బనగానపల్లె లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.1.25 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ (ఐపీహెచ్ఎల్)తో పాటు, అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు రూ.1.57 కోట్లతో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి రోడ్లు మరియు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు వైద్య పరీక్షలు , చికిత్సల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు . ఐపీహెచ్ఎల్ అందుబాటులోకి రావడంతో వివిధ రకాల వైద్య పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని, అత్యాధునిక వైద్య పరికరాల వినియోగంతో రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చేందుకు అదానీ ఫౌండేషన్ చైర్మన్‌కు రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని తాను రాసిన లేఖకు స్పందిస్తూ మొదటి విడతగా రూ.1.57 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందించారని తెలిపారు.ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య పరీక్షలు, మెరుగైన చికిత్స అందించే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.మా విజ్ఞప్తికి వెంటనే స్పందించి సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేసి, విలువైన వైద్య పరికరాలను అందించిన అదానీ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్‌కు, సంస్థ ప్రతినిధులకు వైద్యులు, బనగానపల్లె నియోజకవర్గ ప్రజల తరపున మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో అంకితభావంతో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు.కార్యక్రమంలో బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహా శిల్పి దురుగడ్డ బాల వీరాచారికి డాక్టర్ కే వెంకటాద్రి రావు ఎంతో అనుబంధం ఉంది

## శిల్పి దురుగడ్డ రవీంద్ర చారి దంపతులు



**ఆళ్లగడ్డ ప్రతి నిధి సెప్టెంబర్ 12 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ శారదా శిల్పకళా మందిరం ఆవరణలో శనివారం సాయంత్రం దివంగత సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు శతజయంతి సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. శ్రీ శారద శిల్పకళా మందిరం వ్యవస్థాపకులు దురుగడ్డ రవీంద్ర చారి, సావిత్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. సీనియర్ పాత్రికేయులు కేపీవి సుబ్బారావు మాట్లాడుతూ డాక్టర్ కె. ఆర్ వెంకటాద్రిరావు ఐదు దశాబ్దాల పాటు పాత్రికేయ వృత్తిలో ఆళ్లగడ్డ ప్రాంతంలో విశిష్ట సేవలు అందించారని, తాను 1980 వ సంవత్సరంలో ఈనాడు దినపత్రిక రిపోర్టర్ గా పనిచేసిన సమయంలో ఆయన ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ తదితర దినపత్రికలలో ఆయన అప్పటికే పని చేసేవారని ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆళ్లగడ్డలో ముటా కక్షలు విపరీతంగా ఉన్న రోజుల్లోనే ఆయన ఒక బ్రాహ్మణ కుటుంబంలో ఉండి ఎవరికి భయపడకుండా పాత్రికే వృత్తిని కొనసాగించారని కొనియాడారు. శిల్ప రత్న కీర్తిశేషులు దురగడ్డ బాల వీరాచారి వారి కుటుంబంతో డాక్టర్ పి ఆర్ వెంకటాద్రి రావుకు ఎంతో అనుబంధం ఉందని ఆరోజు ఆళ్లగడ్డలో శిల్పకళ ను ప్రోత్సహించే విషయంలో ఎన్నో తమ పత్రికలో ఆర్టికల్స్ రాసి ఎంతో ప్రోత్సాహం అందించారని కొనియాడారు. ఈరోజు దుర్గడ్డ రవీంద్ర చారి కుటుంబ సభ్యులు ఆ అనుబంధాన్ని మర్చిపోకుండా డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు శతజంతి వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి మాట్లాడుతూ.. తమ తండ్రి దుర్గడ్డ బాలవీరచారి గారికి డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు గారికి ఎంతో అనుబంధం ఉందన్నారు.ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ కేపీవి సుబ్బారావు, డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు కుటుంబ సభ్యులను శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి దంపతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె ఆర్ వెంకటాద్రి రావు కుమారులు మల్లికార్జున రాయల్, వేణుగోపాల్ రాయల్, ఆయన మనవడు ఫిజియోథెరపిస్టు డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్ మైత్రేయి, వారి కుటుంబ సభ్యులు, శిల్పులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా ఎన్.డి.ఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశం

## స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం విజయమే లక్ష్యం కూటమి నేతల వెల్లడి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం, జనసేన, బీజేపీ (ఎన్.డి.ఏ కూటమి) నాయకుల సమన్వయ కమిటీ సమావేశం జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ జోన్5 కోఆర్డినేటర్ మరియు స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి పెళ్ళకూరు శ్రీనివాస రెడ్డి జనసేన కోఆర్డినేటర్ చిలకం మధుసూదన్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు చింతా సురేష్, రేఖ గౌడ్, అర్షద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బి. రామకృష్ణ పరమహంస, రాష్ట్ర బిల్డింగ్ కమిటీ సభ్యులు విట్టా రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సమావేశమునకు హాజరైన నాయకులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహం, క్షేత్రస్థాయి కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్.డి.ఏ కూటమి నూటికి నూరు శాతం విజయం సాధించేలా సమష్టి కార్యాచరణ రూపొందించుకొని, క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేసి, ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు పేర్కొన్నారు.

# పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట

- రూ.657 కోట్ల ప్యాకేజీతో రంగం బలోపేతం.. పాలసీని వేగంగా అమలు చేస్తాం
- ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లు
- ఆధునిక పౌల్ట్రీ ఫారాలకు భారీ ప్రోత్సాహకాలు
- మొక్కజొన్న ధరల నియంత్రణకు ప్రత్యామ్నాయాలపై దృష్టి
- పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులతో
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12:** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 202629కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పాలసీకి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలసీని త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి నూతన ఊతం అందించడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉత్పాదకతను పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పాలసీని రూపొందించినట్లు తెలిపారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశు సంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న కార్యక్రమాలకు రూ.296 కోట్లు కేటాయించనున్నారు. కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకునే రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నామని, ఇందుకోసం మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రైతుల విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు లో–టెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూనిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (ఈసీ) పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీ అందించనున్నాం. ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్లను ఆధునీకరించేందుకు కూడా 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీ అందించేలా ప్రతిపాదించాం. అర్హత కలిగిన ఈసీ పౌల్ట్రీ ఫారాలకు టర్మ్ లోన్లపై వడ్డీ సబ్సిడీతో పాటు విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.2 వరకు, సంవత్సరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు, మూడు సంవత్సరాల పాటు విద్యుత్ టారిఫ్ సబ్సిడీ అందించనున్నాం. అలాగే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్( ఎల్ ఎం) కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు 50 శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీ, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు అందించే అవకాశం కల్పించాం అని మంత్రి తెలిపారు. గ్రామీణ మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు ఎస్సీఈ ఆర్ పి, డి ఆర్ డి ఈ ఆధ్వర్యంలో మహిళలకు 3045 రోజుల శిక్షణ, వ్యాక్సినేషన్, డే–ఓల్డ్ చిక్స్ సరఫరా వంటి సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు విలువ జోడించి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు పి పి పి విధానంలో ఎగ్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలను కేంద్రాలుగా చేసుకుని చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి గతంలో ఉన్న డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీల నుంచి పూర్తి మినహాయింపు కల్పించి, మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీల పరిధిలో గ్రామ పంచాయతీలకు సమానమైన తక్కువ ఫీజులతో అనుమతులు పొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మొక్కజొన్న ధరల పెరుగుదల కూడా ఒకటని పేర్కొన్న మంత్రి, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నూక బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో రాష్ట్ర పౌల్ట్రీ రంగాన్ని దేశంలోనే మరింత అభివృద్ధి చెందిన రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# మున్నలూరుకు బీటీ రోడ్డు..

**కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట**

**ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12 నంది పత్రిక** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య అన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో శనివారం అధికారులు, కూటమి నేతలతో కలిసి సి ఏ డి ,ఆర్ అండ్ బి రోడ్డు మున్నలూరు బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. 1.350 కిలోమీటర్ల మేర రూ.0.55 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి పనులతో గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తోందని కూటమి నేతలు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సౌమ్య కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, నందిగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇది కదా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అంటే

- జగన్ హయాంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఎక్కడ? రైతులకు చేసిన సాయం ఎంత?
- బడ్జెట్‌లో కేటాయింపులు చూపించి.. రైతులకు మాత్రం నిధులు ఇవ్వని జగన్ సర్కార్
- గత 5 ఏళ్లలో రూ.1,475 కోట్లు ఖర్చు చేసి రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పడం దేనికి సంకేతం?
- రైతు పంటకు ధర పడితే.. వెంటనే రంగంలోకి కూటమి ప్రభుత్వం
- గత ఏడాది వివిధ పంటలకు రూ.800 కోట్ల వరకు ధర రక్షణ
- ఈ ఏడాది తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.4 ధర లోటు భర్తీ, పొగాకు రైతులకు కిలోకి రూ.10 ప్రోత్సాహం
- రైతు పంటకు ధర లేకపోతే ప్రభుత్వమే అండ.. ఇదే కూటమి మార్కెట్ ఇంటర్వెన్షన్ విధానం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజారాపు అచ్చెన్నాయుడు వెల్లడి

**అమరావతి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 12: నంది పత్రిక** రైతు పండించిన పంటకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర (ఎమ్మెస్ పి ఎస్ పి) కంటే తక్కువ ధర లభించి నష్టపోయే పరిస్థితి ఏర్పడినప్పుడు, రైతుకు అండగా నిలిచి ధరకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడమే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పేరుతో పెద్దగా ప్రయోజనం కల్పించకపోయినా, భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకున్నారని మంత్రి విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయింపులు చూపించడం, వాస్తవంగా రైతులకు నిధులు అందించడం మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఎద్దేవా చేశారు. రైతుల పంటలకు ధరలు పడిపోయినప్పుడు జగన్ ప్రభుత్వం ఎక్కడ ఉంది? రైతులకు ఎంత సాయం చేసింది? అని మంత్రి ప్రశ్నించారు.202526 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేసిందని మంత్రి తెలిపారు. వివిధ పంటలకు మద్దతు ధరల కోసం సుమారు రూ.800 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా పొగాకు రూ.271 కోట్లు, మామిడి రూ.261 కోట్లు, ఉల్లి రూ.125 కోట్లు, కోకో రూ.14 కోట్లు, టమాటా రూ.12 కోట్లు ఖర్చు చేసామని తెలిపారు. ఈ ఏడాది కూడా తోతాపూరి మామిడి, పొగాకు రైతులకు అండగా నిలిచామని వెల్లడించారు. మార్కెట్‌లో తోతాపురి మామిడి ధరలు పడిపోవడంతో రైతులకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున ధర లోటు భర్తీ చేసిందని మంత్రి తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల్లోని రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించామని చెప్పారు. మొత్తం 7.03 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తికి కిలోకు రూ.4 చొప్పున ధర లోటు చెల్లింపు చేసినట్లు మంత్రి వివరించారు. ఆఫ్–స్టైల్, లో–గ్రేడ్ పొగాకు రకాలను సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందించామని మంత్రి తెలిపారు. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న వేలాది మంది పొగాకు రైతులకు ఈ నిర్ణయం గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**వైసీపీ హయాంలో రైతులను గాలికొదిలేశారు** రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, పంటలకు ధరలు పడిపోయినప్పుడు వారికి అండగా నిలిచిన దాఖలాలు ఆ ప్రభుత్వానికి లేవు అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. 2020లో మార్కెట్ ధర సుమారు రూ.12,000గా ఉన్నప్పటికీ కేవలం రూ.7,000 మద్దతు ధర ప్రకటించి, దానిని అమలు చేయడానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. రైతులకు నిజంగా ఎంత సాయం చేశారో చెప్పకుండా, కాగితాలపై భారీ మొత్తాలు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ 5 ఏళ్ల కాలంలో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు రూ.2,140 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు చూపించి, వాస్తవంగా కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి తెలిపారు. అయితే రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం వైసీపీ ప్రభుత్వ అసమర్థతకు, రైతుల పట్ల దాని నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 2025–2026 ఏడాదిలోనే 800 కోట్లకు పైగా రైతులకు ఖర్చు చేసామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను మాటలతో మోసం చేస్తే.. కూటమి ప్రభుత్వం చేతల్లో అండగా నిలుస్తోంది. వైసీపీ హయాంలో కాగితాలపై కేటాయింపులు, ప్రచారంలో వేల కోట్లు.. కూటమి ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లోకి వాస్తవంగా సాయం. ఇదే రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడా అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పంట ధరలు పడిపోయిన ప్రతిసారీ రైతు మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, అవసరమైన సమయంలో ప్రభుత్వమే మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతును ఆదుకోవడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు. రైతు కష్టపడి పండించిన పంటకు ధర రాకుండా పోతే కూటమి ప్రభుత్వం చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చోదు. రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి సందర్భంలో మార్కెట్‌లో జోక్యం చేసుకుంటాం. నిధులు అవసరమైతే మరిన్ని నిధులు సమకూరుస్తాం. రైతు సంక్షేమమే మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# పనితీరే ప్రామాణికం.. గెలుపే లక్ష్యం







**పసుమర్తి అనురాధ**

**స్థానిక ఎన్నికల్లో కూటమి జెండా ఎగరాలి**

**- ఎమ్మెల్యే రోషన్ కుమార్**

**ఆర్కే ఫంక్షన్ హాల్ లో టీడీపీ కీలక భేటీ**

**విజయవాడ (చింతలపూడి, )బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12 : నంది పత్రిక** చింతలపూడి పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ లో శనివారం చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏలూరు జిల్లా ఎన్నికల అబ్జర్వర్ పసుమర్తి అనురాధ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పసుమర్తి అనురాధ మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూటమి అభ్యర్థులను 100 శాతం గెలిపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో పనితీరు, పార్టీకి చేసిన సేవలే ప్రామాణికమని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ఖరారైన వెంటనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. అత్య రాజకీయాలకు అడ్రస్ గా మారిన వైసీపీ కొన్ని అరాచక శక్తులను వెంటబెట్టుకుని తప్పుడు ప్రసారాలు చేస్తోందని, డీఎస్సీ ఉపాధ్యాయులను కూడా కించపరిచే విధంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుడు వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ... 2029 సార్వత్రిక ఎన్నికలకు ఈ స్థానిక ఎన్నికలే పునాది అని అన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయంతో, విభేదాలను పక్కనపెట్టి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు ముగింపు పలకాలని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మనం నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి తెలిసేలా పనిచేయాలని సూచించారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు బడేటి చంటి మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా కూటమికి అనుకూలమైన వాతావరణం ఉందని, ముఖ్యంగా చింతలపూడి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోనూ కూటమి జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రతి బూత్ నుంచి పార్టీని బలోపేతం చేయాలని, బూత్ కమిటీలను పటిష్టం చేస్తే విజయం మనదేనని అన్నారు. రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన సహకార వ్యవస్థను కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందని, రైతులకు అండగా నిలబడుతోందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రైతులు, సహకార సంఘాల సభ్యులంతా కూటమికే అండగా నిలవాలని కోరారు.నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కూటమి బలంగా ఉందని, అభ్యర్థుల ఎంపికలో కూటమి నేతలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని, అలాంటి ప్రచారాన్ని కార్యకర్తలు దీటుగా తిప్పికొట్టాలన్నారు.మాజీ ఎమ్మెల్యే మురళి మాట్లాడుతూ... ఈ స్థానిక ఎన్నికలు నియోజకవర్గ భవిష్యత్తును నిర్ణయిస్తాయని, అనుభవజ్ఞులైన నాయకులు, యువత సమన్వయంతో పనిచేసి కూటమి విజయానికి కృషి చేయాలన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ... బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉందని, నాలుగు మండలాల్లో ఏకగ్రీవాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, డివిజన్ ఇన్‌ఛార్జులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**19వ డివిజన్‌లో కూలిన భారీ వృక్షం..వెంటనే సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**

**కొండ ప్రాంత వాసులు మరింత జాగ్రత్తలు పాటించాలి**

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12 నంది పత్రిక**

వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రజలను కోరారు.

తూర్పు నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ గ్రీన్‌ల్యాండ్ హోటల్ వెనుక ఆర్‌అండ్‌బి క్వార్టర్స్ దగ్గర శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి భారీ వృక్షం నేలకొరిగింది. ఈ సంఘటన విషయం తెలిసిన వెంటనే తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే కార్పోరేషన్ అధికారులతో మాట్లాడి స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన ఆదేశించారు. ఆయన దగ్గర ఉండి మరీ చెట్టు కొమ్మలను తొలగించేలా చేసి, తెగిన విద్యుత్ వైర్లను సరిచేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న దృష్ట్యా నియోజకవర్గంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వృక్షాల కింద, శిథిలమైన ఇళ్ళల్లో ప్రజలు ఉండకూడదని సూచించారు. రహదారులపై రాకపోకలు సాగించే సమయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండకుండా కార్పోరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నియోజకవర్గంలోని కొండ ప్రాంతాలైన గుణదల, క్రీసురాజపురం, మారుతీనగర్, బ్రహ్మానందరెడ్డి నగర్, నిమ్మతోట సెంటర్, చంద్ర రాజేశ్వరరావు నగర్, దాసరి రమణ నగర్, సున్నపు బట్టీల సెంటర్ మొదలైన ప్రాంతాల్లో కొండలపై నివాసం ఉండే వారు కూడా కొండ రాళ్ళు దొర్లి



పడే అవకాశం ఉన్నందున చాలా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. కార్పోరేషన్ అధికారులు కూడా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గురించి ప్రజలకు వెంటనే సూచనలు ఇచ్చి వారి అప్రమత్తం చేయాల్సిందిగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆదేశించారు.

పార్టీ నాయకులు భాగం సాయిప్రసాద్, శ్యామ్, ఆనంద్, రవీంద్ర తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

నంది పత్రిక
ఆదివారం 13 - 09 -2026

## వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు పాటిద్దాం... భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిద్దాం..

### ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ ఎం. జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12 నంది పత్రిక** వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు పాటించి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పిలుపునిచ్చారు. నిమజ్జనం రోజు విగ్రహాల ఊరేగింపు రూట్ మ్యాప్ ను శనివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఎస్పి సుబ్బరాయుడు, కమిషనర్ ఎం.జయకృష్ణ, విద్యుత్ ఎస్.ఈ.చంద్రశేఖర్, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు కలసి ఆవిష్కరించారు. చవితి వేడుకల్లో నియామాలను ఉల్లగించకుండా భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహిద్దామని మండపాల నిర్వాహకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరవాసులు అందరూ మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తెలిపారు. నగరంలో మండప నిర్వాహకులు అందరూ సమన్వయం పాటించి భక్తి శ్రద్దలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని తెలిపారు. తాము రూపొందించిన రూట్ మ్యాప్ ప్రకారం నిమజ్జనం కొరకు వినాయక సాగర్ కి విగ్రహాలు తీసుకు రావాలని తెలిపారు. మండప నిర్వాహకులు అందరూ నిమజ్జనం తేదీలను ముందుగానే తెలపాలని, ఆరోజే నిమజ్జనానికి రావాలని తెలిపారు. మద్యం సేవించడం వంటివి పూర్తిగా నిషేధం అని తెలిపారు. నిమజ్జనానికి మూడవ రోజు, ఏడరోజున సాగర్ లోను, ఆయా మార్గాల్లో అన్ని ఏర్పాట్లను చేపడుతున్నామని, భక్తులు, మండప నిర్వాహకులు చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్పీ రవి మనోహర్ ఆచారి, డి ఎస్పీలు భక్తవత్సలం, కొండయ్య, నిమజ్జన కమిటీ సభ్యులు ఆర్సి మునికృష్ణ, గుండాల గోపి, నవీన్ కుమార్ రెడ్డి, వరప్రసాద్, మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



## 'దిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

## జీవితం దిశ, దశను మార్చేది చదువు

### చక్కగా చదువుకుని తల్లిదండ్రుల కష్టాలను దూరం చేయాలి

### 4 వేల మందికి ఉపకార వేతనాలను అందచేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12 నంది పత్రిక**జీవిత దిశ, దశను మార్చే శక్తి చదవుకు ఉందని, అందువల్ల విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను దూరం చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. శనివారం ఉదయం లబ్బీపేటలోని ఎస్.ఎస్, కన్వెన్షన్ హాలులో శ్రీరామ్ ఫైనాన్స్ సహకారంతో నగరంలోని 4 వేల మంది విద్యార్థులకు స్కాలర్‘షిప్‘ల పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు స్కా స్కాలర్‘షిప్‘లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఇన్ని వేల మందికి విద్యార్థులకు స్కాలర్‘షిప్‘లను అందచేయడం అభినందనీయమని అన్నారు. దేశంలోని విద్యార్థులందరికి సుమారు 100 కోట్ల రూపాయాలను శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ వారు సీఎస్ఆర్ ఫండ్స్ కింద అందచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చదువు ఒక్కటే దిశ, దశను మారుస్తుందని, చిత్తశుద్ధితో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని విద్యార్థులకు హితవు చెప్పారు. త్యాగరాజన్ అనే ఒక వ్యక్తి చిన్న చిట్‌ఫండ్ కంపెనీగా ఏర్పాటు చేసి ఇప్పుడు దేశంలో 90 వేల మందికి ఉద్యోగాలు కల్పించారని, అందవల్లనే ఆయనను ప్రభుత్వం పద్మభూషణ్ ఇచ్చి గౌరవించిందని తెలిపారు. కృష్ణాజిల్లాలో రూ.4 కోట్ల రూపాయలను ఉపకార వేతనాలను అందచేయడాన్ని ఆయన కొనియాడారు. శ్రీరామ్ ఫైనాన్స్ వారు వ్యాపారం చేయడమే కాకుండా సమాజహితం కోసం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కృష్ణలంకలోని మున్సిపల్ పాఠశాల అభివృద్ధికి వారు ఇటీవలే రూ.35 లక్షలను అందచేశారని చెప్పారు. అనేక మంది పేద విద్యార్థులకు అండగా శ్రీరామ్ సంస్థ ఉంటోందన్నారు. ప్రతి కుటుంబంలో ఒక వ్యక్తి పారిశ్రామిక వేత్త కావాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నాని స్పష్టం చేశారు. చదువే ధ్యేయంగా విద్యార్థులు చదువుకుని, లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటి సాధనకు పట్టుదలగా ప్రయత్నించాలని హితవు చెప్పారు. శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో ఈ విధంగా విద్యార్థులకు స్కాలర్‘షిప్‘లను అందచేస్తున్నామని అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 4 వేల మందికి, రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మందికి ఈ ఉపకార వేతనాలను అందచేస్తున్నట్లు వివరించారు. తమ సంస్థలో కొటి మందికి పైగా పనిచేస్తున్నారని, రవాణా రంగంలోని చిన్న, సన్నకారు వాహన యజమానులకు రుణ సౌకర్యం లక్ష్యంతో శ్రీరామ్ ఫైనాన్స్ ప్రారంభమైందని వెల్లడించారు. ముఖ్యంగా ట్రక్ డ్రైవర్లను వాహన యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తోందని, ద్విచక్ర, మూడు చక్రాల కమర్షియల్ వాహనాలు, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, మెషినరీలు, కార్లు, బంగారు రుణాలు తదితరాలకు కొనుగోలు మరియు రీఫైనాన్స్ కొరకు సౌకర్యం లక్ష్యంతో శ్రీ రామ్ ఫైనాన్స్ అందిస్తోందని తెలిపారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కుటుంబాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని శ్రీరామ్ ఫైనాన్స్ తన సి.ఎస్.ఆర్. కార్యక్రమం ద్వారా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమములో శ్రీరామ్ ఫైనాన్స్ జేఎండీ మరియు సీఓఓ శ్రీ సుదర్శన్ బి హోల్లా, కృష్ణా జిల్లా రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర, జోనల్ బిజినెస్ హెడ్ బి. గోపాలారావు, అఖిల భారత మోటార్ రవాణా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వై.వి. ఈశ్వరరావు, కృష్ణా జిల్లా లారీ ఓనర్ ప్రెసిడెంట్ రాజా తదితరులు పాల్గొన్నారు.



# నందిగామ ప్రజలకు వైద్య భరోసా..

## రూ.1.40 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ప్రారంభం.





### ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన పరీక్షలు అందుబాటులోకి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 12 నంది పత్రిక** నందిగామ పట్టణంలోని డివిఆర్ ఏరియా హాస్పిటల్‌లో రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన పబ్లిక్ హెల్త్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ తంగిరాల సౌమ్య వైద్య సిబ్బంది, కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందించే వైద్య పరీక్షలు, సౌకర్యాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ఒకే చోట అనేక రకాల వైద్య పరీక్షలు** నూతన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ద్వారా ప్రజలకు అవసరమైన అనేక రకాల రక్త, మూత్ర, బయోకెమికల్ తదితర వైద్య పరీక్షలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా పేద, సామాన్య ప్రజలు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన అవసరం తగ్గుతుంది.

ప్రాథమిక ఆరోగ్య పరీక్షల నుంచి వ్యాధుల నిర్ధారణకు అవసరమైన వివిధ పరీక్షలను ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమయానికి వ్యాధులను గుర్తించి, త్వరగా చికిత్స ప్రారంభించేందుకు ఈ ల్యాబ్ ఉపయోగపడనుంది. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నందిగామ నియోజకవర్గంలో వైద్య రంగానికి మరింత ప్రాధాన్యత కల్పిస్తూ డివిఆర్ ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఆసుపత్రి విస్తరణ, అదనపు వైద్య సదుపాయాల కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎక్కడా రాజీ లేకుండా ప్రతి పేద కుటుంబానికి మెరుగైన వైద్యం.. ప్రతి గ్రామానికి అందుబాటులో ఆరోగ్య సేవలు అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యం** ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ అందుబాటులోకి రావడంతో నందిగామ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం కలగనుంది. ఖరీదైన వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి తగ్గడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందే అవకాశం మరింత సులభతరం కానుంది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. అభివృద్ధి, ఆరోగ్యం, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నందిగామ నియోజకవర్గ అభివృద్ధిలో వైద్య రంగాన్ని కీలక భాగంగా తీసుకుని పనిచేస్తున్నామని సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వానం

### ఆహ్వాన పత్రిక అందజేసిన టీటీడీ చైర్మన్, ఈవో



**తిరుమల, బ్యూరో చీఫ్ సెప్టెంబరు 12, నంది పత్రిక** తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడును టీటీడీ ఘనంగా ఆహ్వానించింది. ఈ మేరకు అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, జానకిదేవి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ ఛైర్మన్, ఈవోలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ వేద పండితులు, అర్చకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు

### సాయికృష్ణ కేసులో కీలక పరిణామం.. తల్లి రక్త నమూనాల సేకరణ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తాజాగా సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ పరిణామం కేసు దర్యాప్తులో అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com